**తవణంపల్లి, నవంబరు 11 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా తవణంపల్లిమండలం కాణిపాకం పట్నం సమీపంలోని తిరుపతి-బెంగళూరు జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. జాతీయరహదారిపై ఆగివున్న ట్యాంకర్‌ను వెనుకవైపు నుండి అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో భార్య,భర్తతో పాటు కుమారుడు అక్కడిక్కడే మృతిచెందారు. ఒంగోలుజిల్లా నాగులపాడు మండలం ముప్పాల గ్రామంకు చెందిన ఆంజినేయులు కుమారుడు అద్దంకి అశోక్‌బాబు(33) ఉద్యోగ రీత్యా బెంగళూరులో నివాసం వుంటున్నాడు. ఇతను శుక్రవారం భార్య మౌనిక(29), కుమారుడు ప్రభావ్(3) లతో కలిసి సొంత కారులో తమ స్వగ్రామంకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో కాణిపాకం పట్నం వద్ద తిరుపతి-బెంగళూరు జాతీయ రహదారిలోని సర్వీసు రోడ్డులో ఆగివున్న పాల ట్యాంకర్‌ను అతి వేగంగా వెళ్లి వెనుకవైపు నుండి ఢీకొన్నాడు. ఈ సంఘటనలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న అశోక్‌బాబు, భార్య మౌనిక,కుమారుడు ప్రభవ్‌లు అక్కడికక్కడే ≫2

## రాజీవ్ హత్యకేసు నళిని, మరో ఐదుగురికి విముక్తి



### దోషు లందరిని విడుదల చేస్తూ 'సుప్రీం' సంచలన తీర్పు

### మూడు దశాబ్దాలుపైగా శిక్షలు అనుభవించిన నిందితులు
### పెరరివలన్ విడుదలకు గతంలోనే ఆదేశాలు
### తాజాగా నళిని, రవిచంద్రన్, రాబర్ట్, జయకుమార్, మురుగన్, శాంతన్‌కూ విముక్తి ప్రసాదించిన 'సుప్రీం'



**న్యూఢిల్లీ, నవంబరు 11:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న దోషుల ముందస్తు విడుదలకు సర్వోన్నత న్యాయస్థానం అంగీక రించింది. దోషులు నళిని సహా ఆరుగురిని విడుదల చేయాలని ఆదేశించింది. ఈ కేసులో మూడు దశాబ్దాలకుపైగా జైలు శిక్ష అనుభ వించిన దోషి ఎ.జి.పేరరివాళన్‌కు విడుదల చేయాలని ఈ యేదాది మే 18న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 142 కింద అసాధారణ అధికారాలను ఉపయోగించి సుప్రీం ఈ ఆదేశాలను వెలువరించింది.ఈ నేపథ్యంలో తమను కూడా ముందస్తుగా విడు ≫2


1991 మే 21 రాత్రి శ్రీపెరంబుదూర్‌లో ఆత్మాహుతి దాడి జరగడానికి కొద్ది క్షణాల ముందు థాను అనే బాంబర్ రాజీవ్ గాంధీని కలుసుకున్న దృశ్యం (ఫైల్)

## ప్రపంచం @ 800కోట్లు

### మరో నాలుగు రోజుల్లో అత్యధిక స్థాయికి చేరుకోనున్న జనాభా
### ఐక్యరాజ్య సమితి వెల్లడి

**న్యూఢిల్లీ, నవంబరు 11:**నవంబరు 15 నాటికి ప్రపంచ జనాభా 8బిలియన్లకు చేరుకుంటుందని ఐక్యరాజ్య సమితి అంచనావేసింది. అంతేకాదు, 2023 నాటికి చైనాను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలుస్తుందని పేర్కొంది. ఈ యేడాది జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన యుఎన్ వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2022లో ఈ అంచనా వేసింది.ఈ ≫2

## 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో రాష్ట్రం నంబర్ వన్

### ఆసియాలోనే అతిపెద్ద సుగంధద్రవ్యాల తయారీ ప్లాంట్
### 200కోట్లతో 6.2 ఎకరాల్లో ఏర్పాటు,1500మందికి ఉపాధి: సిఎం జగన్



శుక్రవారం పల్నాడుజిల్లా యడ్లపాడు మండల పరిధిలోని వంకాయలపాడు, మైదవోలు పంచాయితీల పరిధిలో ఐటిసి గ్లోబల్ స్పైసస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్‌ను ప్రారంభించిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

**యడ్లపాడు(పల్నాడు జిల్లా) నవంబరు 11, ప్రభాతవార్త :** గత మూడు సంవత్సరాల నుంచి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుస్తోందని, పరిశ్రమలను పెట్టే వాళ్ల అభిప్రాయాలను కూడా అడిగి పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈజ్ అఫ్ డూయింగ్ బిజినెసె మార్కులు ఇస్తున్నారు అని, ఇటువంటి పరిస్తితుల్లో ఆంధ్రప్రదేశ్ మూడు సంవత్సరాలుగా ఈజ్ అఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా నెంబర్ వన్ స్థానం తీసుకోవడం గొప్ప మార్పునకు నిదర్శమని, ఇక్కడ ఈజ్ అఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడవల్సిన అవసరం ఉందని, దీని నుంచి నేను మాట్లాడటం కన్నా ఐటీసి చైర్మన్ సంజీవ్ పూరి ఆంధ్రప్రదేశ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి గొప్పగా మాట్లాడారని, అయన నుంచి ఈ మాటలు రావడమే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రతి అధికారికి గొప్ప క్రెడిట్ వచ్చిందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహనరెడ్డి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండల పరిధిలోని వంకాయలపాడు, మైదవోలు పంచాయితీల పరిధిలో ఉన్న స్పైసస్ పార్కులో ఐటీసీ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ స్పైసస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్‌ను శుక్రవారం సీఎం వైయస్ జగన్‌మోహనరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ వేలాదిమంది రైతులకు మేలు చేసే ఇంత మంచి పరిశ్రమ ఏర్పాటు చేసినందుకు ఐటీసీ బృందానికి అభినందనలు తెలిపారు. ఐటీసీ గ్లోబల్ స్పైసస్ ప్లాంట్ ఇవాళ ఇక్కడ ప్రారంభం అవుతుందని, దాదాపు 200కోట్ల పెట్టుబడి, ఏటా 20వేల టన్నుల మిర్చితో పాటు మరో 15రకాల సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేసి ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తుందన్నారు. ఐటీసీ స్పైసస్ ప్లాంట్ ప్రత్యక్షంగా, పరోక్షంగా 1500మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.

**3450కోట్లతో 26 జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు :** ఇటువంటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మరిన్ని రావాలని ఇప్పటికే కార్యాచరణ చేశాం. 26 జిల్లాలు ఏర్పాటు చేశాం. ప్రతి జిల్లాల్లో రైతులు స్థానికంగా పండించే పంటలన్నింటికీ మెరుగైన ధర రావాలి. రైతులకు ఇంకా మెరుగైన పరిస్థితులు ≫2

12-11Pg4:Layout 1 12/11/22 11:27 PM Page 1



వార్త

మానవాళికి అద్భుతాలపైన గల అభిలాషయే మూఢనమ్మకాలకు హేతువు.


-ఎసెన్‌బర్గ్

– డేవిడ్ హ్యూమ్

# నేరప్రవృత్తిని కట్టడి చేయలేమా?

చదువు సంధ్యలు పెరిగే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పులు రావాలి. సభ్యతాసంస్కారం పెరగాలి. సాంకేతికంగా అభివృద్ధిచెంది ఆధునిక పరిజ్ఞానం ఆర్జించేకొద్దీమంచి ఏదో, చెడుఏదో గ్రహించే విచక్షణాజ్ఞానం పెరగాలి. కానీ దురదృష్టవశాత్తు అందుకు విరుద్ధంగా తిరోగమిస్తున్నామే మోననిపిస్తున్నది. దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన, జరుగుతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు సభ్యసమాజం తలవంచుకునేలా చేస్తున్నాయి. కొన్ని సంఘటనలు ఉలిక్కిపరుస్తున్నాయి. మనుషుల ప్రాణాలకే విలువ లేకుండాపోతున్నది. మానవ సంబంధాలనుకూడా పక్కన బెట్టి కర్కశంగా వ్యవహరిస్తున్నారు. మానవత్వం కనుమరుగై రాక్షసత్వంతో వ్యవహరించి గడ్డిపరకను పొలం నుంచి పీకివేసినట్లు అతికిరాతకంగా మట్టుపెడుతున్నారు. చిన్నచిన్న కారణాలు కూడా హత్యలకు దారితీస్తున్నాయి. మరొకపక్క కన్నుకు కన్ను, కాలుకు కాలు అనే అటవీ న్యాయాన్ని కూడా అమలు చేసేందుకు ఏమాత్రం వెనుకాడడం లేదు. మొన్న హైదరాబాద్ శివారులోని నేరెడ్‌మెట్ ప్రాంతంలో రెండేళ్ల కుమారుడు అల్లరి చేస్తున్నాడని కోపంతో ఊగిపోయిన తండ్రి విచక్షణమరిచి కొట్టిచంపాడు. ఇక తమిళనాడులో వెలుగు చూసిన సంఘటన అసలు సమాజం ఎటుపోతుందోననే ఆవేదన చెందక తప్పదు. కన్నతల్లిపైనే దాడిచేసి సజీవంగా పూడ్చివేశాడు ఓ కిరాతకుడు. తమిళనాడులోని విల్లుపురం జిల్లా మొగయూర్ సమీపంలో సితమూర్‌లో యశోద తన కుమారుడు శక్తివేలుతో కలిసి ఉంటున్నది. శక్తివేలు చర్యలకు విసిగివేసారిన ఆయన భార్య పిల్లలతోసహా పుట్టింటికి వెళ్లిపోయింది. ఇక కొడుకును వదిలి వెళ్లలేక ఆయనకు వండిపెట్టుకుంటూ తల్లి యశోద కాలం గడుపుతున్నది. మొన్న మంగళవారం రాత్రి మద్యంమత్తులో వచ్చిన శక్తివేలు తల్లితో గొడవపడి దాడిచేశాడు. ఆయన కొట్టిన దెబ్బలకు స్పృహకోల్పోయింది. మద్యంమత్తులో ఉన్న శక్తివేలు చనిపోయిందని ఇంటివెనుకనే ఒక గుంత తీసి రాత్రికిరాత్రే పూడ్చిపెట్టేశాడు. అయితే విషయం తెలుసుకున్న ఇరుగుపొరుగువారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు గుంత తవ్వి యశోదను బయటకు తీసేసరికి ఆ మాతృమూర్తి ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. మొన్న ఒక ప్రబుద్ధుడు కన్న తండ్రినే దారుణంగా హత్యచేశాడు. ఇలాంటివి దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో తరుచుగా జరుగుతున్నాయి. ఇక వివాహేతర సంబంధాల కారణంగా జరుగుతున్న నేరాలు బాగా పెరిగిపోతున్నాయి. భార్యను అడ్డుతొలిగించేందుకు కొందరు భర్తలు హత్యలకు ఒడిగడుతుంటే, భర్తలను అడ్డుతొలగించుకునేందుకు భార్యలు కూడా ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్నారు. అంతకుముందు ఒకసారి గచ్చిబౌలి ప్రాంతంలో ఒక మహిళను ముక్కలుముక్కలుగా నరికి సంచిలో మూటకట్టిపడేశారు. చనిపోయింది ఎవరో కూడా తెలుసుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతున్నది. హైదరాబాద్ శివారు ఉప్పల్ ప్రాంతంలో మూడు నెలల చిన్నారి తలను నరికి గుర్తుతెలియని వ్యక్తులు ఒక ఇంటిభవనంపై పడవేసిన సంఘటన అప్పట్లో కలకలం రేపింది. క్షుద్రపూజల కోసం పాపను బలి ఇచ్చి ఉంటారని అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. గతంలో కడపజిల్లా పొద్దుటూరులో జరిగిన హత్య ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారు. న్యాయస్థానానికి, పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఒక వ్యక్తిని కిందపడేసి మరికొందరు కదలకుండా పట్టుకోగా ఇంకొక వ్యక్తి గొడ్డలితో చనిపోయేవరకు నరికి తాపీగా నడుచుకుంటూపోయాడు. వందలాది మంది చూస్తుండగా అటు ట్రాఫిక్ ఆగి ఉన్నసమయంలో పట్టపగలు ఈ సంఘటన జరిగితే ఏ ఒక్కరు ఆపే ప్రయత్నం చేయకపోగా సెల్‌ఫోన్‌లో వీడియోలు తీశారు. ఇలా వెంటాడి, వేటాడి కర్కశంగా చంపుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నేరప్రవృత్తి పెరుగుతున్న మాట వాస్తవమే కావచ్చు. క్షణికావేశాలకు, మద్యం, మాదకద్రవ్యాలు తోడవుతున్నమాట కూడా నిజం. మాదకద్రవ్యాలను నియంత్రించడంలో విఫలమవుతున్న పాలకులు మద్యం విషయంలో పెంచిపోషిస్తున్నారు. ఇక చట్టాల్లోఉన్న లోపాలు కూడా నేరస్తుల్లో చట్టంపట్ల భయం,భక్తి సన్నగిల్లేలా చేస్తున్నాయి. దీనికితోడు దర్యాప్తుల్లో పోలీసులు అంత సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారు. గతంలో కంటే ప్రస్తుతం శిక్షలశాతం పెరిగినా ఇంకా లక్ష్యాన్ని చేరుకోలేదనే చెప్పొచ్చు. దర్యాప్తులు, విచారణలో జరుగుతున్న జాప్యాలు ఒక కారణం కాగా, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, రాజకీయ జోక్యం కూడా కేసులు వీగిపోవడానికి కారణాలౌతున్నాయి. పాశ్చాత్యమోజులో పడి మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించి మంచి, చెడులను పట్టించుకోకుండా మాదకద్రవ్యాల మత్తులోపడి జోగుతూ ఏం చేస్తున్నారో దిక్కుతెలియని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న యువకుల సంఖ్య తక్కువేమీ కాదు. ఇలాంటి వారే చేయరాని, చేయకూడని పనులు చేస్తూ పతనం అంచుకు చేరుకుంటున్నారు. తాజాగా తమిళనాడులో జరిగిన సంఘటన ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. శాంతిభద్రతలను కాపాడే విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన తరుణమిది. పోలీసులంటే నేరగాళ్లకు సింహస్వప్నంలా ఉండాలి. చట్టం నుంచి తప్పించుకోలేమని, ఏళ్లతరబడి జైళ్లలో మగ్గాలనే భయం ఉండాలి. ఈ నేరాలు నియంత్రించడంలో త్రికరణశుద్ధిగా వ్యవహరించ డంతో పాటు పాలకులు కూడా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించితే తప్ప ఈ దారుణాలు ఆగే పరిస్థితి కన్పించడం లేదు.

రచయిత మేధావిలా ఆలోచించాలి. కానీ సగటు మనిషికి అర్థమయ్యేంత సులువుగా రాయాలి.



అరిస్టాటిల్

నమ్మకంతో సేవకునికి రహస్యాలు చెప్పడమంటే క్రమంగా అతనిని యజమానిగా మార్చుకోవడమే అవుతుంది.



డ్రైడన్

## ప్రజావాక్కు



### సర్టిఫికెట్లు ఆపొద్దు

రాష్ట్రంలో ఇంటర్మీడియేట్, డిగ్రీ ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ ప్రభుత్వం ఇంకా చెల్లించాల్సి ఉంది. సర్కారు ఒక యేడాది విడుదల చేసి మరోసంవత్సరం నిధులు మంజూరు చేయకపోవడంతో ఆయాకళాశాలల్లోని విద్యార్థులు ఒర్జినల్, జిరాక్స్ ధృవపత్రాలు ఇవ్వకుండా విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. కాలేజీ, లైబ్రరీ,స్పెషల్‌ఫీజు పేరిట ఫీజులుచెల్లించాలని ఆపుతున్నాయి. ప్రైవేట్ ఉద్యోగాల కోసమైనా సర్టిఫికెట్ల పరిశీలన కోసం కనీసం జిరాక్స్ పత్రాలు ఇవ్వడంలేదు. సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందికి పెట్టడంబాధాకరం. ఫీజుల పేరిట సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఆయా కళాశాలలు ఇబ్బంది పెట్టొదని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. విద్యార్థుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం ఉన్నత విద్యా మండలి, ఆయాకళాశాలలపై చట్టరీత్యాచర్యలు తీసుకోవాలి. ఇబ్బందిపెట్టే విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేయాలి.

-తలారి గణేష్, వెల్లంకి యాదాద్రి జిల్లా

### సమైక్యపోరాటమే పరిష్కారం

ఇప్పటం గ్రామంలో అక్రమంగా ఇళ్ల కూల్చివేతపై జనసేన ఘాటుగా స్పందిస్తే మిత్రపక్షమైన బిజెపిలో కనీస స్పందన కరవైంది. రాష్ట్రంలో అరాచక పాలనకి వ్యతిరేకంగా జనసేన శ్రేణులు పోరాటం చూస్తుంటే మిత్రపక్షంగా ఉన్న బిజెపి వారు పాలకపక్షంతో లాలూచి రాజకీయం చేస్తూ ఏ సందర్భంలోనూ జనసేనకు కనీసం తన సంఘీభావాన్ని తెలపడానికి కూడా ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా జనసేన అధినేత తన మిత్రులెవరో, మిత్రులుగా నటిస్తున్నదెవరో సమీక్షించుకోవాలి.

-జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

### గవర్నర్ స్థానం వివాదాలకు నెలవు!

కేరళలోప్రభుత్వానికి, గవర్నర్‌గారికి మధ్య వివాదం పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడి కేబినెట్ ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా గవర్నర్‌నితొలగిస్తున్నట్టు ఆఉత్తర్వుల ఆమోదంగవర్నర్ పేరు మీదుగానే జరగాల్సి ఉన్నందున ఆయనేసంతకం పెట్టాల్సి ఉంటుంది. కాబట్టిప్రభుత్వం ఆయన్నేఅభ్యర్థిస్తోంది. తనకు తానే ఆఛాన్సలర్ కుర్చీ నుండి తొలగించుకునే ఆర్డినెన్స్‌కు సంతకం చేసి ఆమోదించమని. చిత్రంగా ఉంది కదూ! వారధిగా ఉండాల్సిన గవర్నర్ స్థానం ఇలా వివాదాలకు నెలవు కావడం శ్రేయస్కరం కాదు.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### భూతాపం తగ్గింపునకు కట్టుపడాలి

రాబోవు దశాబ్దకాలంలో భూతాపం తగ్గింపునకు అగ్రదేశాలు సహా అన్ని దేశాలు కట్టుబడాలి. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఈజిప్ట్‌లో జరుగుతున్న వాతావరణ సదస్సులో ప్రధానంగా గ్లోబల్‌వార్మింగ్‌ప్రభావం,గ్రీన్‌హౌస్ వాయువులతగ్గింపు, భూతాపం తగ్గించేందుకు వివిధ దేశాలు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి భూమిపై ఉష్ణోగ్రతల నియంత్రణకు కృషి చేయాలి. గతంలో ప్యారిస్‌ఒప్పందం అమలు 1. డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్ర తలను తగ్గించే లక్ష్యానికి అగ్రదేశాలు ఏమాత్రం ప్రయత్నం చేయలేదు. ఐక్యరాజ్యసమితి కూడా అగ్రదేశాల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ దేశాల ప్రభుత్వాధినేతలుకూడా తమరాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టి భూతాపంతగ్గింపునకు నూరుశాతం కట్టుబడాలి. కాలుష్యాన్ని వెదజల్లే పారిశ్రామిక సంస్థలపై ఉక్కుపాదం మోపాలి.

-చల్లాచంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

### ప్రభుత్వ అలసత్వం

గుజరాత్ మోర్బి వద్ద తీగల వంతెన కూలిన దుర్ఘటన ఇటీవలి చరిత్రలో కనీవిని ఎరుగనిది. బ్రిటిష్‌కాలం నాటి ఈ వంతెనకు ఇటీవల మరమ్మతులు చేసి కొద్ది రోజుల క్రితమే రాకపోకలకు అనుమతించారు. ఈ వంతెనకు పూర్తిస్థాయిలో మరమ్మతులు జరగకుండానే ట్రాఫిక్‌కి అనుమతించారన్న ఆరోపణలు దురదృష్టకరం. తీగలవంతెన అతిసున్నితమైనది. అయినప్పుడు ఇంకా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సింది. ఒకసారి వంద మందిని మాత్రమే అనుమతించగల వంతెనపైకి ఐదువందల మందిని అనుమతించడంఅధికారుల నిర్లక్ష్యవైఖరికి నిదర్శనం. ఈవంతెన మరమ్మతులను హడావుడిగా పూర్తి చేశారనీ, పెద్దఎత్తున అవి నీతిచోటుచేసుకుందని, పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించకుండానే సందర్శకుల అనుమతికి తెరిచారన్న కథనాలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపించాలి. పురాతన కట్టడాలపై ఏ ప్రభుత్వమైనాఅలసత్వం ప్రదర్శించడం సరికాదు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఒక్క క్షణం ఆలోచించండి!

ఈ మధ్యకాలంలో కొందరు ఒంటరిగా బస్టాప్‌లలో ఉన్న ఆడ వాళ్లతో అసభ్యంగా ప్రవర్తిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు కొందరు ఆడవాళ్లు ధైర్యంగా ఇటు వంటి వారికి బుద్ధిచెబుతున్నా, చాలామంది ఎందుకొచ్చిన గొడవలే అని మౌనంగా భరిస్తున్నారు. ఇలా ఆడవాళ్లను వేధించే వాళ్లు ఇలాంటి పరిస్థితి తమ తోబుట్టువులు, కుటుంబ సభ్యులకు ఎదురైతే ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచిస్తే ఇక ఇటువంటి తప్పు ఎప్పుడూ చేయరు.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# విశ్వసనీయత లోపమే కాంగ్రెస్‌కు శాపం!

**కాంగ్రెస్ పార్టీ నేటికీ సజీవంగా ఉందంటే మొన్నటి మునుగోడు ఎన్నికల్లో అభ్యర్థికి ఇరవైమూడువేల ఓట్లకుపైగా వచ్చాయంటే ఆనాడు స్వాతంత్ర్యసమరంలో పెద్దలుచేసిన త్యాగం, ఆతర్వాత ఇందిరాగాంధీ పేదప్రజల అభ్యున్నతికి చేపట్టిన సంస్కరణలు నేటికీ కొన్నివర్గాల మనస్సుల్లో స్థానంసంపాదించిపెట్టాయి. ఆ వర్గాలుకూడా కొందరి నాయకులచేష్టలతో,ప్రవర్తనలతో క్రమేపీదూరమైపోతున్నాయి. పార్టీ బలహీనమైపోతున్నది. ఇప్పటికైనా కాంగ్రెస్‌పెద్దలు ఆలోచించాలి. తమను ఒకనాడు ఆదరించిన వర్గాలే ఇప్పుడెందుకు దూరమవుతున్నాయో, విశ్వసించడంలేదో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసు కుంటే వారికేఅర్థమవుతుంది. ఆ కోణంలో ఆలోచించకుండా తమగొప్ప తమకు తుమ్మెద.. అన్నట్లు వ్యవహారించుకుంటూ ముందుకుపోతే రాబోయేరోజుల్లో జెండాపట్టుకోవడానికి కూడా మనిషి దొరక్కపోవచ్చు.**

దామెర్ల సాయిబాబ

ఓటమి అనేది కుంగిపోవాల్సిందికాదు. మరింత మెరుగైన స్థితికి చేరుకోవడానికి పనికివచ్చే నిచ్చెన అన్నారు పెద్దలు. ఎంతో అనుభవంతో చెప్పిన మాటలు అవి. గతంలో ఎందరో పెద్దలు పరాజయంపాలై అందులో నుంచి పాఠాలు నేర్చుకొని తిరిగి నూతనోత్సాహంతో కదనరంగంలోకి దిగి లక్ష్యాన్ని సాధించారు. అయితే పరాజయం పాలుకావడానికి కారకులు,కారణాలు, తప్పిదాలు, పొరపాట్లు కూలంకషంగా చర్చించి భవిష్యత్తులో అలాంటివి మళ్లీమళ్లీ దొర్లకుండా చర్యలు చేపట్టి ముందుకు అడుగులు వేసిన నాడే అవి నిచ్చెనలా పనిచేస్తుంది. లక్ష్యాలను సాధించగలుగుతారు. తెలంగాణలో వరుసగా అవమానకర పరాజయాల పాలవుతున్న తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ ఆ దిశలో అడుగులు వేయకపోవడం దురదృష్టకరం. గత ఏడెనిమిదేళ్లుగా కాంగ్రెస్‌పార్టీ తెలుగురాష్ట్రాల్లో గడ్డుపరిస్థితి ఎదుర్కొంటున్నది. 2014 అసెంబ్లీ ఎన్నికల నుండి వరుసపరాజయాలపాలు కావడానికి కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? ఎక్కడ పొరపాట్లు జరుగుతున్నాయి? తదితర అంశాలు లోతుగా చర్చించి ఈ ఓటములతో గుణపాఠాలు నేర్చుకొని అడుగులువేయాలి. కానీ ఆకోణంలో రాష్ట్రనేతలు కానీ, అటు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ అధిష్టానవర్గం కానీ అంతగా ఆలోచించడం లేదేమోననిపిస్తున్నది. గెలుపు ఓటములు సహజమే కావచ్చు. కానీ అవమానకర వరుస పరాజయాల మాటేమిటి? ఇవన్నీ పట్టించుకోకుండా ఎన్నికల లోపాలు, అధికార దుర్వినియోగం, మద్యం, డబ్బు పంపిణీ వంటి పరనిందలతో కాలం గడుపుతున్నారేమోననిపిస్తున్నది. మొన్నటి మునుగోడు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘోరపరాయజంపాలైంది. 2018 ఎన్నికల్లో తొంభైఏడువేలకుపైగా ఓట్లుసాధించి విజయదుందుభి మోగించినకాంగ్రెస్ పార్టీ ఈసారి అదే మునుగోడులో ఇరవైమూడువేల తొమ్మిది వందలకు పరిమితమై డిపాజిట్ గల్లంతయిందంటే ప్రజలకు ఎంత దూరమైపోతున్నదో అర్థం చేసుకోవచ్చు. మొన్న హుజురాబాద్‌లో అదే పరిస్థితి. అది కాంగ్రెసు సీటుకాదని సర్ది చెప్పుకొన్నారు. కానీ అంతకు ముందు సాధారణఎన్నికల్లో వచ్చిన ఓట్లు ఎన్ని? ఉప ఎన్నికల్లో వచ్చిన ఓట్లుఎన్నో పరిశీలిస్తే వారి మనసులకే అర్థమవుతుంది. మునుగోడు ఎన్నికలు అటు బిజెపి, ఇటు టిఆర్ఎస్ ప్రతిష్టాకరంగా తీసుకున్నాయి. ఎలాగైనా మును గోడు కైవసం చేసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి, టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పటిష్టమైన వ్యూహాన్నే రూపొందించారు. పద్నాలుగు మందిపైగా మంత్రులు, ఎనభై మందికి పైగా శాసన సభ్యులతోపాటు పార్టీ యంత్రాంగాన్ని మొత్తాన్ని మోహరించారు. మరొకపక్క నిరుపేద, రైతులకు,వృద్ధులకు చేయూతనిచ్చేవృద్ధాప్య పింఛన్, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి లాంటి పథకాలతో పాటు ఇరవై నాలుగు గంటలు కరెంటు నిరంతరాయంగా అందివ్వడం లాంటి కార్యక్రమాలు ప్రకటించి అమలు చేస్తున్నారు. చేసినవి, చేయబోయేవి చెబుతూ ఇంటింటికి వెళ్లి టిఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు ప్రజలను తమదైన శైలిలో అభ్యర్థించారు. కొన్ని పథకాలు అసంపూర్తిగా ఉన్నా కళ్లముందు కన్పిస్తున్నాయి. మొత్తం మీద టిఆర్ఎస్ శ్రేణులు చావోరేవో అన్నట్లుగా మునుగోడుయుద్ధంలో పనిచేశారు. బిజెపి ఆస్థాయిలో లేకపోయినా గట్టి ప్రయత్నమే చేసింది. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గ్రామగ్రామానికి తిరిగి ఓటర్లను కలుసుకుని వారిని ఆకర్షించేందుకు గంటలతరబడి వారితో గడిపారు. కేంద్రమంత్రులు,పార్లమెంటు సభ్యులు పార్టీ పెద్దలు కాలికి బలపం కట్టుకొని తిరిగారు. కాంగ్రెస్‌కు సంబంధించి ఆ స్థాయిలో ప్రయత్నం జరగలేదని చెప్పొచ్చు. కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి దాదాపు ఒంటరిపోరు చేశారనే చెప్పొచ్చు. అప్పుడప్పుడు పిసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు మరికొందరు నేతలు రోడ్‌షోలు,సభలు,కొన్ని సమావేశాల్లో ఆమెతోపాటుపాల్గొని ప్రసంగించినా కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక,అంగబలం లోటుకన్పించింది. గెలుపుకోసం కాంగ్రెస్‌వాదులంతా సమైక్యంగా త్రికరణశుద్ధిగా పనిచేయలేదని చెప్పొచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా నల్గొండ జిల్లాలో బలం ఉన్న భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఒక్క మాట

కీలకమైన ఈ తరుణంలో ముఖంచాటేసి విదేశీపర్యటనకు వెళ్లారు. ఇక పిసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఉన్న కోపంతో కొందరు, టిఆర్ఎస్‌తో ఉన్న లోపాయికారి సంబంధాలతో మరికొందరు, వ్యక్తిగత అవసరాల కోసం ఇంకొందరు, ఇలా కాంగ్రెస్ నేతలు ఏదో ముఖం చూపించి ప్రచారంలో హాజరేసుకున్నారే తప్ప మనస్ఫూర్తిగా కాంగ్రెస్ అభ్యర్థికి చేయూతనివ్వలేదని చెప్పొచ్చు. ఇలాంటి కారణాలు ఎన్నో కాంగ్రెస్‌పై విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేశాయి. కాంగ్రెస్‌కు ఓటువేస్తే గెలిచిన తర్వాత ఏదో కారణాన్ని చూపి ప్రత్యర్థిపార్టీలో కలిసిపోతారనే ప్రచారం పట్ల ప్రజల్లో నమ్మకం రానురాను పెరిగి పోతున్నది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పద్దెనిమిది స్థానాలు గెలుచుకోగా ప్రస్తుతం ఐదుగురు ఎమ్మెల్యేలు మాత్రమే కాంగ్రెస్‌పార్టీలో ఉన్న విషయాన్ని పలువురు గుర్తుచేస్తున్నారు. అందుకే అన్నింటికంటే నమ్మకం అనేది ఎంతో ముఖ్యం. ఇది లోపించిన నాడు ఎన్నిమాటలు చెప్పినా, మరెన్ని పథకాలు ప్రకటించినా, నిరుపయోగం. విశ్వసనీయత అనేది ఒక సంఘటనతోనో, ఒక్కరోజులోనో ఏర్పడేదికాదు. ఎంతో కాలంగా నిశితంగా పరిశీలించి ప్రవర్తన, చెప్పేమాటలు, చేసే పనులు, అన్నింటిని బేరీజు వేసుకున్నతర్వాతనే ఒకవ్యక్తిపై అభిప్రాయం ఏర్పడుతుంది. నమ్మకం, విశ్వసనీయత ఏర్పర్చుకోవడం ఎంతకష్టమో, అది పోగొట్టుకోవడం అంత సులభం. ఒక్కక్షణం చాలు. విశ్వసనీయత లేకపోతే సాక్షాత్తు భగవంతుడు దిగివచ్చి చెప్పినా నమ్మరనే విషయాన్ని చెప్పడానికి ఎన్నో పౌరాణిక ఉదంతాలు ఉన్నాయి. వ్యాసభారతంలో సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుడే ఈ విషయాన్ని లోకానికి చాటిచెప్పాడు. కురుక్షేత్ర యుద్ధంఅనంతరం పాండవులకు రాజనీతి బోధించమని శ్రీకృష్ణుడు అంపశయ్యపై ఉన్న భీష్మాచార్యున్ని కోరుతాడు. అవసాన దశలో ఉన్న తాను ఎలా చెప్పగలనని, మాట్లాడే శక్తి లేదని, అయినా తనకు అవేవీ గుర్తురావడం లేదని, తన అసక్తతను వ్యక్తంచేశారు. జ్ఞాపక శక్తితో పాటు సంపూర్ణ ఆరోగ్యం,అన్ని ఇస్తానని కృష్ణుడు కోరగా, అవన్నీ నాకు ఇచ్చి నాతో చెప్పించడం కన్నా మీరే చెప్పవచ్చుకదా అని భీష్మాచార్యుడు బదులిచ్చాడు. కౌరవ,పాండవుల పోరు జరుగుతున్నప్పుడు యుద్ధభూమిలోనే అర్జునుడికి భగవద్గీతబోధించాను. కానీ ప్రయోజనం లేకుండాపోయింది. మీ జీవిత అనుభవంతో రాజ నీతిని వడబోసి చెబితే అది వారికి ఉపయోగపడుతుంది. భావితరాల కోసం నిలిచిపోతుందని కృష్ణుడు భీష్ముడి ఔన్నత్యాన్ని చెప్పకనే చెప్పాడు. ఇచ్చిన మాటకోసం రాజ్యాన్ని త్యజించడమే కాదు ఆజన్మంతా బ్రహ్మచారిగా, ఆదర్శజీవితం గడిపిన భీష్ముడిపై పాండవులకే కాదు, ఆ సామ్రాజ్యంలోని ప్రజలకు కూడా అపారమైన విశ్వాసం, నమ్మకం. ఆ కారణంగానే భీష్ముడితో రాజనీతిని శ్రీకృష్ణుడు చెప్పించాడు. ఇది విశ్వసనీయతకు ఉన్న ఉదాత్తత. తెలంగాణలోనే కాదు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి విశ్వసనీయత తగ్గిపోతున్నది. కోల్పోయిన విశ్వసనీయతను తిరిగి సాధించేందుకు ప్రజల్లో అభిమానం పెంపొందించేందుకు ఇప్పుడిప్పుడే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జోడోయాత్ర ప్రారంభించారు. ప్రజల ఆదరణ లభిస్తున్నది కూడా. చివరిగా ఒక్కమాట. కాంగ్రెస్ పార్టీ నేటికీ సజీవంగా ఉందంటే, మొన్నటి మునుగోడు ఎన్నికల్లో అభ్యర్థికి ఇరవైమూడువేల ఓట్లకుపైగా వచ్చాయంటే ఆనాడు స్వాతంత్ర్య సమరంలో పెద్దలు చేసిన త్యాగం, ఆ తర్వాత ఇందిరాగాంధీ పేద ప్రజల అభ్యున్నతికి చేపట్టిన సంస్కరణలు నేటికీ కొన్ని వర్గాల మనస్సుల్లో స్థానం సంపాదించి పెట్టాయి. ఆ వర్గాలు కూడా కొందరినాయకుల చేష్టలతో, ప్రవర్తనలతో క్రమేపీ దూరమైపోతున్నాయి. పార్టీ బలహీనమైపోతున్నది. ఇప్పటికైనా కాంగ్రెస్ పెద్దలు ఆలోచించాలి. తమను ఒకనాడు ఆదరించిన వర్గాలే ఇప్పుడు ఎందుకు దూరమవుతున్నాయో, విశ్వసించడం లేదో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకుంటే వారికే అర్థమవుతుంది. ఆ కోణంలో ఆలోచించకుండా తమగొప్ప తమకు తుమ్మెద... అన్నట్లు వ్యవహారించుకుంటూ ముందుకుపోతే రాబోయే రోజుల్లో జెండా పట్టుకోవడానికి కూడా మనిషి దొరక్కపోవచ్చు. ●

# మానవ హక్కుల అమలు అంతంత మాత్రమే!

కనుక ఎల్లారెడ్డి

మానవ హక్కులు పేరులోనే మానవుడి పేరు జొప్పించడంతో వీటికి విశేష ప్రాధాన్యత ఏర్పడింది. ఇవి అందరికి ఉపయుక్తంగా ఉన్నాయి. కాబట్టి సార్వజనీనమైనవి. 1948లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కులను ప్రకటించింది. ఒక లక్ష్యంతో ఈ ప్రకటన ఐక్యరాజ్యసమితి చేసింది. విశ్వమంతా ఒకే కుటుంబం అనే భావన ప్రజల్లో బాగా నాటుకుపోయేటట్లు చేసింది. ఐక్యరాజ్యసమితి చొరవతోనే ఇవి విశ్వవ్యాప్తం అయ్యాయి. ఒక గుర్తింపువచ్చింది. వీటికి గొప్ప ఆశయాలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా రక్షణపొందే స్వేచ్ఛ, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం ప్రధానమైన ఆశయాలు. వ్యక్తులలో నిబిడీకృతమైన నైపుణ్యాలను వినియోగించుకునే స్వేచ్ఛ, ఆశయాలు బహు ఉత్తమంగా ఉన్నాయి. అయితే ఆచరణలో ఏవీ ఉండడం లేదు. ప్రతిచోట మానవ హక్కులకు అన్యాయమే జరుగుతోంది. మా హక్కు మాకు కావాలి అని నినదించడం చూస్తూనేఉన్నాం. ఇటీవల ఒకప్రైవేట్‌సంస్థ ఉద్యోగులను తొలగించడం దుమారం రేపింది. ఇది ఆ సంస్థలోనే కాదు నేడు చాలాసంస్థలలో ఉద్యోగులను తొలగించే ప్రక్రియ ఉంది. అలా తొలగించబడిన ఉద్యోగులకు తదుపరి ఎక్కడా ఉద్యోగంరాక, కుటుంబాలను పోషించుకోలేక సతమతమవుతున్నారు. కొన్ని కుటుంబాలలో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. ఈవిధంగా జరగడం వారి హక్కును హరించడమే ఇక్కడ మానవ హక్కులుఎక్కడా? ఇది చూసే ఐక్యరాజ్యసమితి హక్కుల అధ్యక్షుడు వొల్కర్ టక్కర్ మానవ హక్కులు ఉద్యోగుల నైపుణ్యాలను గౌరవించడం ప్రధానం అని పేర్కొన్నారు. సంస్థ నుంచి ఉద్యోగులను తొలగించడం ద్వారా ఆయనస్పందిస్తూ ఉద్యోగులను తొలగించడంలో వారుఅభద్రతా భావంతో ఉంటారని, వారి కుటుంబాలు వీధినపడతాయని ఇది మంచి పద్ధతికాదని ఆసంస్థ నూతన యజమాని తెలియచేశారు. ఉద్యోగులను తొలగించాలి అనుకుంటే ముందుగా వారికి చెప్పి మీరు ఆరు నెలల్లోగా మరో ఉద్యోగం చూసుకోండి అని అప్పటి వరకు వారికి వచ్చే వేతనం ఇవ్వాలి. ప్రస్తుతం కొన్ని సంస్థలు అవేమీ ఇవ్వడంలేదు. ఇది ఎక్కువగా ఎక్కడ ఉందంటే భారత్‌లో కొన్నిరాష్ట్రాలలో ప్రైవేట్ సంస్థలలో పనిచేసేవారు ముఖ్యంగా బోధనాసంస్థలలో పనిచేసేవారు తమ హక్కులను కోల్పోతున్నారు. ఇక్కడ యాజమాన్యం వారిహక్కులు అణగద్రొక్కడం శోచనీయం. సదరు ఉద్యోగినెలలో మధ్యలో కొన్ని కారణాలవల్ల డ్రాప్ అయితే అంతవరకు అతనికి రావాల్సిన బకాయిలు చెల్లించాలి. ఇవేమీ సంస్థలు చేయడంలేదు. అంతవరకు అతను చేసిన శ్రమ అంతా నిరుపయోగం. ఏమైనా ప్రశ్నిస్తే వారు మధ్యలో వెళ్లారు మాకు, మాసంస్థకు నష్టంఅని యాజమాన్యం చెప్పడం, దానికి కొందరు ఉద్యోగులు ఎదురుతిరగడం,కొందరు మౌనంగా ఉంటున్నారు. ఇంకా కొన్నిసంస్థలలో ఉద్యోగి ఉండగానే అతనిస్థానంలో మరొకరిని చేర్చుకోవడం చూస్తే ఇక మానవ హక్కులు ఎక్కడ సమర్థవంతంగా పనిచేస్తున్నాయి? అనే ప్రశ్న ఉదయిస్తోంది. ఉద్యోగి తనంతట తానే తొలగిపోతే అతను పనిచేసిన దానికి వేతనం ఇవ్వాలి. తదనంతరం సంస్థ వారిస్థానంలో మరొకరిని నియమించుకోవచ్చు. ఇదంతా ఒక ఎత్తైతే కంపెనీ పని భారం తగ్గించుకోవాలని, లేక పొదుపు చర్యలు తీసుకోవాలని తలంచినప్పుడు కొన్ని ప్రముఖసంస్థలు ఉద్యోగులను తొలగించడం వారి హక్కులను కాలరాయడమే ఈ వివక్షతొలగాలి. అందుకే సంస్థలలో తప్పుడుప్రచారం ఉండకూడదని టర్క్ పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి హక్కును గౌరవించాలి. ఉద్యోగిని గౌరవప్రదంగా చూసుకోవాలి. ఉద్యోగులేసంస్థలకు మూలస్తంభం వంటివారు. ఊపిరి వారే, ఉద్యోగులే లేకపోతే సంస్థలు ఆగిపోతాయి. ●

# ఉద్యోగ సంఘ నేతలు విమర్శలకు అతీతులా?

డాక్టర్ కోలావాలం రామ్ కిశోర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడే 1956లో, ఆ తర్వాత కూడా తెలంగాణ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారు. వారు ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ఏర్పాటును ఎంతమాత్రం అంగీకరించలేదు. వారి అనుమానాలు, అపోహలు, భయాలను ఖాతరు చేయకుండానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. పెద్దమనుషుల ఒప్పందం నియమాలు,హామీలను లక్ష్యపెట్టలేదు. ఆంధ్రపాలకులు తెలంగాణ ఉద్యోగులకూ అనేక ఇబ్బందులు కలిగించారు. చివరకు వారి ప్రోద్బలంతోనే 1969 తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంగా పోరాటం ప్రారంభమైంది. ఉద్యమ సమయంలో తెలంగాణ ఉద్యోగులు పోలీసుల లాఠీదెబ్బలు, జైళ్లలో నిర్బంధాలుఎదుర్కొన్నారు. వారి వీరోచిత పోరాటంతోనే తెలంగాణలో అన్నివర్గాల ప్రజలనూ,రాజకీయ పార్టీలనూ, నాయకులనూ ఏకం చేసి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమబాట పట్టించారు. 2001లో కూడా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రసమితి ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు సబ్బండ వర్గాలను కలుపుకొని రాస్తారోకోలు, రైలురోకోలు సాగర హారం, వంటావార్పు, ధర్నాలు, మిలియన్ మార్చ్ ఒకటి కాదు అనేక వినూత్న పోరాట విధానాలను చేపట్టారు. కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థులు మిగతా అన్నివర్గాల వారి తోడ్పాటుతో రాష్ట్ర సాధనాకృషి ఫలించింది. ఈ సందర్భంగా యన్.జి.ఓల పాత్ర మరువలేనిది. 1956 మొదలు నేటి వరకు ఉద్యోగ సంఘ నాయకులు ఆయా ప్రభుత్వాలతో సంప్రదించి అనేక ఉద్యమరూపాలలో పోరాడి అనేక ఘనవిజయాలు సాధించిన మాట నిజం. ఆ పోరాటాలు ఉద్యోగుల ఉద్యమ చరిత్రలో నిలిచిన మాట కూడా నిజం. అయితే బిజెపి రాష్ట్ర నాయకుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఉద్యోగుల గురించి కాదు. కొందరి ఉద్యోగ సంఘ నాయకుల ప్రవర్తన గురించి మాత్రమే. మునుగోడు యన్.జి.ఓ కార్యాలయంలో టి.ఆర్.ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌కు అనుకూలంగా యన్.జి.ఓ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్ సమక్షంలో జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవణకుమార్ బహిరంగ మద్దతు తెలిపి రాజకీయ ప్రసంగం చేయడం అభ్యంతరకరం. ఉద్యోగ సంఘ నాయకులకు రాజకీయ ప్రసంగాలు దేనికి?అంత ఉత్సాహం ఉంటే ఉద్యోగాలకు రాజీనామా చేసి టి.ఆర్.యస్‌పార్టీ తరపున ప్రచారం చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. తెలంగాణ యన్.జి.ఓ నాయకులు ప్రభుత్వానికి సంప్రదింపుల ద్వారా నివేదికలు సమర్పించి తమ న్యాయమైన డిమాండ్‌లు సాధించాలి. అవసరమైతే వివిధ పోరాటాల మార్గాల ద్వారా దశలవారీగా ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలి. అంతేకానీ తమ సొంత ట్రాన్స్‌ఫర్లు, తమ అనుచరుల అక్రమ ప్రమోషన్లు, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం తమ వ్యక్తిత్వాన్ని, సాటి ఉద్యోగుల ప్రయోజనాలకు గండి కొట్టరాదు. ముఖ్యంగా తెలంగాణ యన్.జి.ఓ సంఘ నాయకులు ఈ సమస్యలు పరిష్కారించలేదని ఉద్యోగులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. అవి ఏమిటంటే ఒకటో తేదీన జీతం రావడం లేదు. 317 జి.ఓతో భార్యా భర్తలను విడగొట్టారు. వారి సమస్యలు పట్టించుకోలేదు. బదలీలు, పదోన్నతులు రావటం లేదు. పండితు



లు, పిఈటిల హామీలు నెరవేర్చడం లేదు. ఉద్యోగులకు అనేక సమస్యలున్నా పట్టించుకోకుండా ప్రభుత్వంతో యూనియన్ నాయకులు రాసుకపూసుకు తిరుగుతూ, తమతమ అనుచరుల ప్రయోజనాల కొరకే కృషిచేస్తున్న టిజిఓ,టిఎన్జీఓ ఉద్యోగ సంఘాల నాయకులు చిన్న చిన్న విమర్శలకే అసహనం ప్రదర్శించడం చూస్తుంటే నవ్వొస్తుంది. మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంలో డిఏ ఇవ్వకున్నా ఇచ్చినట్లు, ఉద్యోగుల కోర్కెలన్నీ సి.యం అంగీకరించినట్లు ప్రకటించడాన్ని ఏమనాలి? రాష్ట్రం డి.ఏ.లు ప్రకటించకపోయినా కిమ్మనని ఉద్యోగ సంఘాల నాయకులను ఏమనాలి? ఉద్యోగుల సరెండర్ లీవులు, ఇతర సప్లిమెంటరీ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు నెలల తరబడి పెండింగ్ పెట్టినా కిమ్మనని ఉద్యోగ సంఘాల నాయకులను ఎలా ఉపేక్షించాలి? ఒకే స్థానంలో నాలుగైదేళ్లుగా పనిచేయిస్తూ బదలీలు జరపకుండా ఇబ్బందులు పెడుతున్నా స్పందించని ఉద్యోగ సంఘాల నాయకులను ఏమనాలి? 10వ తారీఖు వరకూ జీతాలు రాకపోయినా చీటికిమాటికి వెళ్లి ప్రతీదానికి ఒకరోజు వేతనం విరాళంగా ప్రకటించే నాయక గణాన్ని ఏమనాలి? పీఆర్సీని మూడేళ్లు ఆలస్యం చేసి మొత్తం ఐ.ఆర్.సి.ని తీసేస్తే, ఒక సంవత్సరం ఆరియర్స్ ఇవ్వకుండా, ఇచ్చే ఆరియర్స్‌ని కూడా 12 విడతలుగా ఇచ్చి, పిఆర్సీ అనామలిస్ గురించి చర్చించని వారిని ఏమనాలి? భార్యాభర్తలను ఒకే దగ్గర పనిచేసేటట్లు చూస్తామని ఇచ్చిన హామీపై అమలుకై ప్రశ్నించని వారిని ఏమనాలి? 317 జి.ఓను ఆదరాబాదరగా రూపొందించడం, అమలులో ఉద్యోగ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురాకుండా, హడావిడిగా అమలు చేస్తుంటే పట్టించుకోకుండా ఏమీ చేయలేక, ఉద్యోగుల మరణాలకు, ఆవేదనకు కారణమైన నాయకులను ఏమనాలి? నేటికీ 317 జి.ఓ అమలు పూర్తి కానేలేదు. ఆర్టీసీ ఉద్యోగులు తమఉద్యోగాలు పణంగా పెట్టి, ఆత్మహత్యలు చేసుకున్నా సాటి ఉద్యోగులకు నైతిక మద్దతు తెలపని వారినేమనాలి? విఆర్వో లాంటి రెవెన్యూ ఉద్యోగులను తీసేసివారిని వేరే డిపార్ట్‌మెంట్లకు విసిరేసినా పట్టించుకోని,చర్చించడానికి ఆలోచన చేయని వారిని ఏమనాలి?రిటైర్డ్ ఉద్యోగులకు దక్కాల్సిన ప్రయోజనాలను, బెనిఫిట్స్‌ను, అరియర్స్‌ను నెలలు నెలలుగా ఇవ్వకపోయినా పరిష్కరించకపోయే వారిని ఏమనాలి?ఉద్యోగుల పని ప్రదేశాలలో సరైన వసతులు, సదుపాయాలు లేకపోయినా ప్రశ్నించని వారినేమనాలి? మెడికల్ రీయింబర్స్‌మెంట్లు క్లెయిమ్స్, ట్రీట్మెంట్స్, కాంపన్సేషన్ విషయాలలో ఎన్నో సమస్యలున్నా పరిష్కరించలేని వారినేమనాలి? ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయి. ఉద్యోగులు మాత్రం ప్రభుత్వ అవసరాలకు తగ్గట్టు వారివిధులు నిర్వర్తిస్తారు. అసలు సంఘాలు ఉన్నదే సభ్యుల సమస్యల పరిష్కారం కోసం. అయితే ఇప్పటివరకు ఎన్ని సమస్యలు పరిష్కరించారు? శ్వేత పత్రం విడుదల చేసి రాజకీయ నాయకుల కామెంట్స్ మీద స్పందించండి! రాజకీయ పార్టీల నాయకుల వలే ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడటమేమిటి? ప్రభుత్వానికి, అధికార పార్టీకి గుడ్డిగా మద్దతు తెలుపుతూ, ఎన్నికల సమయంలో అధికార పార్టీ తరపున ఆత్మీయసమ్మేళనాలను జరిపేటమేమిటి?భుజాలు తడుముకోవడమాని, ఉద్యోగుల,పెన్షనర్ల బాగు కోసం ఆలోచన చేసి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం మంచిది. పైగా సర్వీసు రూల్స్ జి.ఓ.ఎమ్ఎస్.నెం.77, జి.ఎ.ఎస్‌సి నెం.19(1) ప్రకారం నేరంకూడా. ఉద్యోగులు రాజకీయ పార్టీలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగిఉండరాదు. రాజకీయ పార్టీలలోసభ్యత్వం స్వీకరించరాదు. ఎన్నికలలో ప్రచారం చేయరాదు. ఈ విషయాలు ఎన్.జి.ఓ నాయకులకు తెలియదనుకోవాలా? ●

06ATP27_06ATP27.qxd 11-11-2022 PM 09:57 Page 1



## గ్రామస్థాయిలో ప్రతి ఆర్బీకేలోనూ తప్పక సమావేశం నిర్వహించాలి

### -ఉరవకొండ అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశంలో జిల్లా ఛైర్మెన్ కె.రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా ఛైర్మెన్ కె.రాజశేఖర్‌రెడ్డి

**ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త :** గ్రామస్థాయిలో ప్రతి ఆర్బీకేలోనూ అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించి రైతులు, బోర్డు సభ్యులందరూ హాజరై చర్చించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం అవసరమని అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా ఛైర్మెన్ కె.రాజశేఖర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించగా మండల అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మెన్ వెంకటేశులు, ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, ఉరవకొండ పీఏసీఎస్ అధ్యక్షులు వడ్ల షేక్షావలి, ఏడీఏ పద్మజ, పశుసంవర్ధకశాఖ డీడీ వెంకటేశులు, హార్టికల్చర్ అధికారి నెట్టికంఠయ్య, విద్యుత్ ఏఈ గురుమూర్తి, ఏఓ శశికళ, పట్టుపరిశ్రమ అధికారి మెహతాజ్ సుల్తానా, మాజీ సర్పంచులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బోర్డు జిల్లా ఛైర్మెన్ కె.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి రైతు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతారని ఆమె జిల్లాకు కలెక్టర్‌గా రావడం జిల్లా రైతులు చేసుకున్న అదృష్టమన్నారు. ఏడీఏ పద్మజ మాట్లాడుతూ డివిజినల్ పరిధిలో పూర్తిస్థాయిలో ఈ-క్రాప్ బుకింగ్ చేయడం జరిగిందని సోషల్ ఆడిట్‌లో వచ్చిన పిర్యాదులను పరిష్కరించామన్నారు. ఏఈ శశికళ మాట్లాడుతూ పప్పుశెనగ పంపిణీ, ఖరీఫ్ పంటల ఈ-క్రాప్ బుకింగ్ పూర్తిస్థాయిలో చేపట్టగా ప్రతి ఆర్బీకేలోనూ ఎరువులను అందుబాటులో ఉంచామని వివరించారు. పశుసంవర్ధకశాఖ డీడీ జి.వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో పశుసంవర్ధకశాఖలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. డివిజన్ మొత్తం 10,600 ఆపరేషన్లు నిర్వహించగా 60శాతం వాక్సినేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. హార్టికల్చర్ అధికారి నెట్టికంఠయ్య మాట్లాడుతూ కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో ఈ-క్రాప్ బుకింగ్ పూర్తిస్థాయిలో చేశారన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు త్వరితగతిన సమస్యలను పరిష్కరించి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆర్బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఊరేగింపు

**రామగిరి, నవంబర్ 11 ప్రభాతవార్త :** మండలంలోని కుంటిమద్ది గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఊరేగించారు. ఎమ్మార్పిఎస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు ఆధ్వర్యంలో ఈ ఊరేగింపును గ్రామంలో నిర్వహించారు. తహశీల్దార్ నారాయణస్వామితోపాటు పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ ఊరేగంపులో పాల్గొన్నారు. కుంటిమద్దిలోని ప్రధానరహదారి వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

## గురుకులు పాఠశాలకు జాలరీలు ఏర్పాటు



కోతులు రాకుండా జాలరీలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**రామగిరి, నవంబర్ 11 ప్రభాతవార్త :** మండలంలోని నసనకోట గల మహాత్మాజ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో కోతులు రాకుండా జాలరీలు ఏర్పాటు చేశారు. పాఠశాలలో కోతుల బెడత అధికంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడేవారు. దీంతో పాఠశాల కమిటీ సభ్యులు తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారితో విరాళాలు సేకరించి జాలరీ ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల ప్రిన్సిపల్ మునిరత్నమ్మ, కమిటి, తల్లిదండ్రులను అభినందించారు.

## మండల జర్నలిస్ట్ ప్రెస్‌కబ్ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన జర్నలిస్టులు

**మడకశిర నవంబర్ 11 ప్రభాతవార్త;** పట్టణంలోని స్థానిక రోడ్డు భవనాల శాఖ వసతి గృహంలో శుక్రవారం నిర్వహించిన జర్నలిస్టుల సమావేశంలో మండల మరియు ప్రెస్‌క్లబ్ కమిటీలను ఎన్నుకొన్నారు.మడకశిర మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఆంధ్రజ్యోతి శ్రీనివాసులు, అధ్యక్షులుగా విశాలాంధ్ర తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆంధ్రజ్యోతి హనుమంతరాయప్ప, కోశాధికారిగా ప్రజాశక్తి నాగరాజు, సెక్రెటరీగా సాక్షి హరిప్రసాద్,జాయింట్ సెక్రెటరీగా ఏబిఎన్ చంద్రశేఖర్‌రెడ్డి మరియు ప్రెస్‌క్లబ్‌కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఆంధ్రప్రభ విశ్వనాథ్‌రెడ్డి, అధ్యక్షులుగా ప్రైమ్9న్యూస్ వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా ఆంధ్రభూమి త్రిలోక్‌నాథ్,కోశాధికారిగా సాక్షి కృష్ణారెడ్డి,సెక్రెటరీగా ఐ న్యూస్ నగేష్,జాయింట్ సెక్రెటరీగా మహాన్యూస్ ఆంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.ఈసందర్భంగా ఎన్నికైనా జర్నలిస్టులు మాట్లాడుతూ అందరు కలసి కట్టుగా పోరాడి జర్నలిస్టుల అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.

## శ్రీ దుర్గాభవాని ఆలయంలో ప్రత్యేక పూజలు



**ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త:** పట్టణంలోని స్థానిక శ్రీ దుర్గాభవాని ఆలయంలో స్వస్తిశ్రీ శుభకృత్‌నామ సంవత్సరం కార్తీక 3వ శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు జరిపారు. పలువురు భక్తులు భవాని దీక్ష స్వీకరించగా గురుస్వాములు వారికి మాలధారణ గావించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకోగా ఆలయ కమిటీ వారికి తీర్థప్రసాదాలు అందించింది.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



జాతీయ గ్రంథాలయ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త:** ఈనెల 14వ తేదీ నుండి 20వ వరకు జరిగే 55వ జాతీయ గ్రంధాలయ వాల్ పోస్టర్లను విడపనకల్లు వైస్ ఎంపీపీ కరణం పుష్పావతి ఆవిష్కరించారు. విడపనకల్లు మండలంలోని గడేకల్లు గ్రామ సచివాలయంలో విడపనకల్లు గ్రంధాలయ అధికారి మీనుగ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ గ్రంధాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని పిల్లలు, పెద్దలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుశీల ఉమాశంకర్, ఉప సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ ఓబులేష్, గడేకల్లు మాజీ సర్పంచులు కరణం భీమరెడ్డి, మేకల పంపాపతి, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, సోమయ్య, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా కనకదాసు జయంతి



కనకదాసు చిత్రపటాన్ని ఊరేగింపు చేస్తున్న దృశ్యం

**పావగడ, నవంబర్ 11 ప్రభాతవార్త :** పట్టణంలో శుక్రవారం కనకదాసుని జయంతి అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంఎఆర్ సర్కిల్‌లో కనకదాసు విగ్రహానికి పూలతోఅలంకరించి పూలమాలలువేసి స్థానిక వేణుగోపాల్ స్వామి దేవస్థానం నుంచి పట్టణ పురవీధుల గుండా కనకదాసు చిత్రపటాన్ని ఊరేగించారు. ఊరేగింపులో చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దాదాపు 3వేల మందికిపైగా కురుబలు ఊరేగంపులో పాల్గొన్నారు. తాలూకాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కనకదాసు జయంతిని నిర్వహించారు.

## ఉచిత వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోండి - సర్పంచు

**గుడిబండ, నవంబర్ 11 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మోరుబాగిల్ గ్రామంలో నిర్వహించే ఉచిత వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు తిప్పేస్వామి ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురం పట్టణంలోని చంద్రా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర ంయలో ఈనెల 12వ తేది శనివారం మోరుబాగిల్ గ్రామ సచివాలయంలో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సది ్వనియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

## ఘనంగా యూనియన్ బ్యాంకు 104వ ఆవిర్భావ దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

**గుడిబండ, నవంబర్ 11 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మొరుబాగల్ యూనియన్ బ్యాంకులో బ్యాంకు మేనేజర్ లోకేష్ ఆధ్వర్యంలో బ్యాంకు 104 సంవత్సర ఆవర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులతో కలిసి కెకె కట్ చేసి ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ లోకేష్ మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎల్లప్ప, ఆర్డిఓ ఉమాదేవి, క్యాషియర్ రవి, వెలుగు సిసి మల్లికార్జున, యానిమేటర్లు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.


## కనకదాసు జయంతి వేడుకలు



కనకదాసుకు నివాళులు అర్పిస్తున్న నేతలు

**మడకశిర టౌన్, నవంబర్ 11 ప్రభాతవార్త :** పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్లాయయం బాలాజీ నగర్‌లో కురుబ ఆరాధ్యదైవం కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కనకదాసు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ రాష్ట్రఉపాధ్యక్షులుగుండుమల తిప్పేస్వామి, డాక్టర్ శ్రీనివాస్‌మూర్తిలు మాట్లాడుతూ.. కురుబ కులస్తుల ఆరాధ్య దైవం కనకదాసు జయంతి వేడుకలు నిర్వహించడం ఎంతో గొప్పదని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆధునిక కవి, తత్వవేత్త సంగీత కారుడు స్వరకర్త అయినటువంటి కనకదాసు కర్ణాటక సంగీతం కోసం కన్నడ భాషలో రచించిన కీర్తనలు ఎంతో ప్రాచుర్యం పొందాయని అలాంటి కవితత్వ వేత్తను స్మరించుకోవడం ఎంతో పుణ్య ప్రధామన్నారు. ఆయన రచనలు స్ఫూర్తితో ఆధ్యాత్మికతను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎందుకంటే మానవ సమాజంలో మనిషి తన్ను తాను సంస్కరించుకోవడానికి ఇలాంటి తత్వవేత్తలు చూపిన దారే భావితరాలకు ఉపయుక్తమవుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్ సెల్ సెక్రెటరీ అడ్వకేట్ రాధాకృష్ణ, జిల్లాకురుబ సాధికార అధ్యక్షులు అడ్వకేట్ గోవిందప్ప, కన్వీనర్ మద్దనకుంటప్ప, సర్పంచు నాగరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులుమంజునాథ, యువ నాయకులు రంగేగౌడ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## కోగిరి, శాపురం, కంబాలపల్లి భూములను పరిశీలించిన తహశీల్దార్



భూములను పరిశీలిస్తున్న తహశీల్దార్ రెవిన్యూ అధికారులు

**రొద్దం, నవంబర్ 11 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోగిర, శాపురం, కంబాలపల్లి గ్రామాల రైతులు సాగు చేసుకుంటున్న భూములను శుక్రవారం మండల రెవిన్యూ అధికారులు, తహశీల్దార్ అనంతచారి పరిశీలించారు. భూమి సాగు చేసుకుంటున్న రైతులందరూ వేరువేరుగా అర్జీలు ఇస్తే అర్హత మేరకు ఉన్నతాధికారులు నివేదికలు పంపి భూపంపిణికి అవకాశం ఉంటుందన్నారు. పై భూమి రెవిన్యూ రికార్డులు ప్రకారం అటవీ ప్రాంతమని ఇందులో ఏ ప్రైవేటు స్వచ్ఛంద సంస్థలు కూడా సంబంధం లేదని తెలిపారు. అలాని రైతులకు సాగు చేసుకోమని చెప్పలేమని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ రైతులు కలిసికట్టుగా ఐక్యంగా పోరాడాలని పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రస్తుత భూ పంపిణీలో సాగు దార్లకు న్యాయంచేయకపోతే న్యాయ పోరాటానికి సిద్ధమని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపియం పార్టీ మండల కార్యదర్శి ఫకృద్దీన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు గంగాధర్, సాగుదారులు కిష్టప్ప, అంజినప్ప, నారాయణ, నరసింహప్ప, మారుతి తదితరులతోపాటు 150 మంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో శుక్రవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కలాం తొలి విద్యాశాఖ మంత్రిగా తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను వివరించారు. డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి, బాటనీ, కంప్యూటర్ సైన్సు అధ్యాపకులు జె.భీమలింగయ్య, యం.సుధాకర్, బి.శివప్రసాద్, డా॥పి.రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా॥బి.వెంకటరాముడు, ఎన్.ఎ.అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రిపుల్ ఇఇఇ విభాగాధిపతి వై.సురేష్‌బాబు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా॥సుల్తానా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.వెంకటేష్‌నాయక్, అధ్యాపకులు జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ఘోర ప్రమాదం..!

### -బస్టాప్‌లో తెగిపడిన 11కేవీ విద్యుత్ తీగలు
### -పాల్తూరు గ్రామంలో చోటు చేసుకున్న ఘటన
### -దర్గాహొన్నూరు ఘటన మరువకముందే మరొకటి



పాల్తూరు గ్రామంలో బస్టాప్‌వద్ద తెగిపడిన విద్యుత్ తీగలు

**ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త :** ఘోర విద్యుత్ ప్రమాదం తృటిలో తప్పిన ఘటన నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక బళ్లారి రోడ్డులోని హావళిగి బస్టాప్‌వద్ద బస్సుల కోసం ప్రయాణీకులు వేచివున్న సయయంలో ఒక్కసారిగా విద్యుత్ స్తంభం నుండి 11కేవి హై టెక్షన్ విద్యుత్ తీగలు తెగి పడగా ప్రయాణికులు తృటిలో తప్పించుకున్నారు. ప్రయాణీకులకు ఒకటి రెండు అడుగుల దూరంలోనే తీగలు తెగి పడిపోగా ఏం జరిగిందో తెలియక ఆయోమయానికి గురయ్యారు. దీంతో అప్రమత్తమైన స్థానిక ప్రజలు విద్యుత్ తీగలవైపు ఎవ్వరూ వెళ్లకుండా చూడటంతోపాటు విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. ఇంతలోనే అక్కడికి చేరుకున్న విద్యుత్ సిబ్బంది వద్ద పనిచేసే ప్రైవేటు ఎలక్రీషియన్లు తెగిపడిన విద్యుత్ తీగలను చుట్టుకొని తమ వెంట తీసుకెళ్లారు. ఈనెల 2వ తేదీన దర్గాహొన్నూరు గ్రామంవద్ద విద్యుత్ తీగలు తెగి ట్రాక్టర్ మీద పడిన ప్రమాదంలో ఐదుగురు కూలీలు మృతి చెందగా మరికొందరు గాయపడిన ఘటన మరువక ముందే ఈ ఘటన చోటు చేసుకోవడం విశేషంగా చెప్పాలి. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోవలసి వస్తోందని స్థానిక ప్రజలు మండి పడుతున్నారు.

## ఘనంగా భక్త కనకదాసు 535వ జయంతి



శ్రీ భక్త కనకదాసు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కురుబ నాయకులు

**ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త :** ఆధునిక కవి, తత్వవేత్త, ప్రముఖ వాగ్గేయకారుడు భక్త కనకదాసు 535వ జయంతి వేడుకలు ఉరవకొండ పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణంలో ఉంచిన భక్త కనకదాసు విగ్రహానికి కురుబ ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రం హావేరి జిల్లా బాద గ్రామంలో జన్మించిన కనకదాసు సామాన్యాలకు అర్థమయ్యేలా కన్నడ బాషలో రచనలు చేస్తూ కీర్తనలు రాస్తూ వేదాంతాన్ని అభ్యసించి గొప్ప కృష్ణ భక్తుడయ్యారన్నారు. ఆయన కన్నడ భాషలో రచించిన నలచరిత్ర, హరిభక్తిసార, నృషింహస్తవ, రామధ్యాన చరిత్రే, మోహన తరంగిణి తదితరాలు ఎంతో ప్రచుర్యాన్ని పొందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కె.గోవిందు, మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు చేజాల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ పచ్చిరవి, నాయకులు రాకెట్ల రామిరెడ్డి, చిన్నభీమ, బూదగవి ధనుంజయ, గాదిలింగ, ప్రకాష్, సురేష్, మల్లికార్జున, గోపి, కుబేర, ప్రసాద్ పాల్గొన్నారు.

## ఘనంగా అబుల్ కలాం అజాద్ 134వ జయంతి



మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త :** భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి దివంగత మౌలానా అబుల్ కలాం అజాద్ 134వ జయంతిని శుక్రవారం వైసీపీ ముస్లీం మైనార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ జరిగిన కార్యక్రమానికి అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా ఛైర్మెన్ కె.రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, పీఏసీఎస్ అధ్యక్షులు వడ్ల షేక్షావలి, ఉపసర్పంచ్ జి.వన్నప్ప,కార్యదర్శి కె.గౌస్‌సాహెబ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఆవరణంలో నిలిపి ఉంచిన కలాం విగ్రహానికి పూలమావేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ నిరక్షరాస్యతను తగ్గించి అక్షరాస్యతను పెంచడానికి ప్రతి ఒక్కరికీ విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి అబుల్ కలాం అజాద్ ఎనలేని కృషి చేశారన్నారు. 1988లో జన్మించిన ఆయన 1947 నుండి 1958 వరకు విద్యాశాఖా మంత్రిగా పనిచేశారని కొనియాడారు. విద్యారంగంలో చేసిన సేవలకు గాను ఆయనకు 1992లో భారత ప్రభుత్వం భారతరత్న అత్యున్నత పురస్కారాన్ని అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, వైసీపీ మైనార్టీ విభాగం అధ్యక్షులు పామిడి జాకీర్, వైసీపీ నాయకులు ఏ.సి.ఎర్రిస్వామి, యం.బసవరాజు, బి.ఆసీఫ్, యం.ఎ.జిలాన్, మద్దికేర అన్వర్, వడ్ల సలీమ్, అయ్యార్ సాధిక్, మహబూబ్, హుస్సేన్, వడ్డే ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## 14 నుంచి వేరుశనగపంపిణీ కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభం



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

**అమరాపురం, నవంబర్ 11 ప్రభాతవార్త :** మండలంలోని రైతులు బోరు బావుల కింద వేరుశనగ విత్తనాల సాగు కోసం ఈనెల 14 నుంచి వేరుశనగ పంపిణీ కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభించనున్నట్లు వ్యవసాయ అధికారి మంజునాథ్ తెలిపారు. వేరుశనగ కావాల్సిన రైతులు బోరు పట్టాదారుపుస్తకం, జీరాక్స్ బోరు బావి గుత్త రసీదు తీసుకునిరైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ డబ్బు కట్టిన తరువాత రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఒక బస్తా వేరుశనగ విత్తనం ధర రూ. 1545 లు మూడు వస్తాల వరకు ఇవ్వడం జరుగుతందని. ఈనెల 30లో వరకు ఆవకాశం ఉంటుందని ఆసక్తి రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు.

## ప్రధానమంత్రి మోడి గోబ్యాక్

### - వామపక్షనేతల నిరసన

**గుత్తి, నవంబర్ 11 ప్రభాతవార్త**



వామపక్షనేతలు నిరసన తెలుపుతున్న దృశ్యం

రాష్ట్రాభివృద్ధి పట్ల మొండిచేయి చూపిన దేశ ప్రధాని నరేంద్రమోడి గోబ్యాచ్ అంటూ నిరసిస్తూ శుక్రవారం సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో గాంధీచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, పోలవరానికి నిధులు మంజూరు చేయకుండా విశాఖ ఉక్కుతో పాటు రైల్వేను ప్రైవేటుపరం చేస్తున్న మోడి తెలుగుజాతికి ద్రోహం చేస్తున్నారని వారు మండిపడ్డారు. మోడి గోబ్యాక్ అంటూ మోడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్య క్రమంలో సిపిఐ కార్యదర్శి రామదాసు, వీరభద్రస్వామి, మక్బుల్‌బాష, రమేష్, సిపిఎం కార్యదర్శి రామకృష్ట, నిర్మల, మల్లికార్జున, మహమ్మద్, నూర్జహాన్, డానియల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కనకదాస జయంతి



కనకదాస విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**గుత్తి, నవంబర్ 11 ప్రభాతవార్త :** పట్టణంలో శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో కురబల ఆరాధ్యదైవం కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అనంతపురం రోడ్డులో వున్న కనకదాస విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్, గుంతకల్లు పార్టీ కనీ ్వనర్ బండా ఆనంద్, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కురబల అభ్యున్నతికి వారిలో చైతన్యం నింపేందుకు ఆయన చేసిన కృషిని వారు కొనియాడారు. ఈ కార ్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామాంజినేయులు, సంచారజాతుల ఉపాధ్యక్షులు కుళ్లాయప్ప, మాజీ సర్పంచు సుంకన్న, మాజీ ఎంపిటిసి పులికొండ, అంజి, పవన్, రవి, హరి, రాము, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆగ్రహారంలో గడపగడకు మన ప్రభుత్వ కార్యక్రమం

**అమరాపురం, నవంబర్ 11 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఆగ్రహారం నందు శనివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యా క్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పిటిసి స్వారక్క నరసింహామూర్తి, ఎంపికి కెంకెర ఈరన్న వైస్ ఎంపిపిలు కృష్ణమూర్తి, లలితమ్మ, రంజీత్‌కుమార్ లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే డా. తిప్పేస్వామి, కుంచిటిగ కార్పొరేషన్ ఛైర్మన్ నళిని రంగేగౌడ్ వస్తున్నారని కావునా మండలంలోని వైకాపా ముఖ్య నాయకులుకార్పొరేషన్ డైరెక్టర్లు, కార్యకర్తలు, ఎంపిటిసిలు ప్రజా ప్రతినిధులు అందరూ హాజరు కావాలని వారు కోరారు.

## గ్రంథాలయాలు భావి తరాలకు ఎంతో మేలు

### -ఎంపిపి పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి



గ్రంథాలయ గోడ పత్రికలు విడుదల చేస్తున్న దృశ్యం

**తాడిమర్రి, నవంబర్ 11 ప్రభాతవార్త** మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాలు రాబోవు తరాలకు ఎంతో మేలు చేకూరు స్తాయని ఎంపిపి పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎండిఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎండిఓ విజయలక్ష్మి ఈఓఆర్డి కామాక్షి, గ్రంథాలయ అధికారి శీనా నాయక్‌లతో కలిసి ఎంపిపి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 14వ తేదిన ప్రారంభ వేడుకలు జరుగుతాయని, 15వ తేదిన పుస్తకప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, 16వ తేది గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న వారిని స్మరించుకోవడం, 17న కవిసమ్మేళనం, సెమినార్లు, సమావేశాలు వారి సందేశాలు ఉంటాయన్నారు. 18న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న దిశ చట్టంపై అవగాహన కార్యక్రమం, 20న డిజిటల్ గ్రంథాలయాల అవగాహన నిర్వహిస్తామని అలాగే గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి శీనా నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, విద్యార్థులు, పుస్తక ప్రియులు, పాఠకులు విరివిగా పాల్గొనాలని, తమ సలహాలు, సూచనలు ఉంటే గ్రంథాలయం అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

## ఉపాధిహామీతో కూలీల ఆర్థికాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి, ఎండిఓ

**తాడిమర్రి, నవంబర్ 11 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం వల్ల రైతు కూలీల ఆర్థికాభివృద్దిని సాధిస్తున్నారని ఎంపిపి పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎండిఓ కార్యాలయం లో జరిగిన పంచాయితీ సెక్రెటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులు హార్టికల్చర్‌ను సాగు చేయాలని ఇందుకు ఏపిఓలు, పంచాయతీ సెక్రెటరీలు కృషి చేయాల్సి ఉంటుందన్నాను. అలాగే వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులకు అనేక గ్రామాల్లో సక్రమంగా రహదారులు లేవని ఆ సమస్య పరిష్కారానికై రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. తద్వారా పండించిన పంటలను వాహనాల ద్వారా పట్టణ ప్రాంతాలకు తరలించడానికి రైతులకు అనువుగా ఉంటుందని, అలాగే రస్తా గొడవలు కూడా తగ్గిపోయే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఎండిఓ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం పథకాలను తూచా తప్పకుండా పాటించాలని తద్వారా ప్రభుత్వ పథకాలు విజయవంతం చేయడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలోఉపాధి ఏపిఓ సంజీవరెడ్డి, ఈసి అశోక్‌కుమార్‌రెడ్డి, ఈఓఆర్డి కామాక్షి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని నిర్ధేశించుకొని చదివితే విజయం మీ సొంతం..!

### -విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు క్రిష్ణ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు క్రిష్ణ

**ఉరవకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త :** ఇంటర్నెట్, సోషల్ మీడియాలకు బానిసలు కాకుండా లక్ష్యాన్ని నిర్ధేశించుకొని ఎకాగ్రతతో చదివితే విజయం మీ సొంతమవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు క్రిష్ణ పేర్కొన్నారు. లయన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున, ప్రతినిధులు బి.జాబీర్, టి.గణేష్‌బాబు, ఎస్.క్రిష్ణమోహన్, వాల్మీకి సురేంద్రల సౌజన్యంతో విద్యార్థులకు పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపంలో సోషల్ మీడియా, ఇంటర్నెట్‌లపై వ్యక్తిత్వ వికాస కార్యక్రమం జరుగగా ఆయన ముఖ్య అతిదిజగా హాజరయ్యారు. క్రిష్ణ మాట్లాడుతూ సినిమాలు, సీరియళ్లు, సెల్ ఫోన్లు చూడటం మానుకొని ఆ సమయాన్ని చదువుకు కేటాయించాలన్నారు. పట్టుదల, క్రమ శిక్షణ ఉంటే ఏదైనా సాధిస్తారని లక్ష్యంలేని జీవితం వ్యర్థమని పేర్కొన్నారు. బట్టీ చదువులకు స్వస్తిచెప్పి చదువుతున్న అంశంపై ఏకాగ్రత కలిగివుండి అర్థం చేసుకుంటే ఆది ఎప్పటికైనా గుర్తుండి పోతుందన్నారు. పోటీ ఉండాలిగాని భయం ఉండకూడదని నిన్ను నీవే తక్కువగా అంచానా వేసుకోవద్దని నీలో దాగివున్న శక్తిసామర్థ్యాలను బయటకుతీసి కొంత మెరుగుపర్చుకుంటే నీకంటే తోపులెవరూ లేరన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున, కార్యదర్శిబి, బి.లక్ష్మినారాయణ, కోశాధికారి టెక్కే నజీర్‌సాబ్, ప్రతినిధులు టి.గణేష్‌బాబు, కొమ్మసాని బాలచంద్ర, యేళ్ల ప్రభాకర్‌నాయుడు, రెడ్డిమాసి సత్యనారాయణ, యం.సి.నాగభూషణ, సి.నాగేశ్వరరావు, ఎస్.క్రిష్ణమోహన్, యం.సి.జయకృష్ణ సాదు విక్రమ్, వాల్మీకి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు

## రాంగోపాల్‌రెడ్డి గెలుపు మేధావుల విజయం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో టిడిపి శ్రేణులు

ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఎన్నికల్లో గెలుపు మేధావుల విజయంగా అభివర్ణిస్తూ హిందూపురం పార్లమెంటరీ తెలుగురైతు మీడియా కోఆర్డినేటర్ ఆర్‌ఎంపి జాకీర్, జిలా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజి నేయులు ప్రచారం ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఓడీ చెరువు మండలంలోని పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి రాష్ట్రంలో జరుగు తున్న పరిస్థితులను వారికి వివరించారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రస్తుత ప్రభుత్వం విస్మరించిందని విద్యావంతులు, మేధావులు ఆలోచించి రాష్ట్రాన్ని కాపాడా ల్సా ని అవసరం ఎంతైనా ఉందన్నారు. మొదటి ప్రాధాన్యతా ఓటును రాంగో పాల్‌రెడ్డికి వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాంగోపాల్‌రెడ్డి బంధువులు కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, నల్లమాడ మండల కన్వీనర్ మైలే శంకర, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గంగాద్రి, నియోజకవర్గ బిసి సెల్ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, పార్లమెంట్ తెలుగుయువత కార్యదర్శి జయచంద్రారెడ్డి, టిడిపి నాయకులు చెంద్రాయుడు, సంగాల శ్రీనివాసలు, వినోద్ నాయుడు, చంద్రారెడ్డి, సుధాకర్‌నాయుడు, వెంకటేష్, నరేష్, లక్ష్మణ్‌లు పాల్గొ న్నారు.

## 14న నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

### - గ్రంథాలయ అధికారి రాజబాబు

ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14(సోమవారం) నుండి ప్రారంభిస్తున్నట్లు ఓడీచెరువు గ్రంథాలయ అధికారి రాజబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. స్థానిక గ్రంథాలయంలో 14వ తేదీ గ్రంథాలయ వారోత్సవ ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. 15న పుస్తకప్రదర్శన ఏర్పాటు(15 నుడి 20వ తీదీ వరకు)అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16వ తీదీ గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17వ తీదీన కవిసమ్మెళనాలు, సెమినార్‌లు, రచయితల సందేశా లు, 18వ తేదీన పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ మరియు క్రీడల పోటీలు, 19వ తేదీన దిశా చట్టం మరియు మహిళా సాధికారితపై చర్చ, 20న వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల అభినందసభ ఏర్పాటు, బహుమతుల ప్రధానం నిర్వహిస్తామన్నారు. కనుక ఈ అవకాశాన్ని విద్యార్థులు, పుస్తకప్రేమికులు, యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మోదీ గో బ్యాక్, పిఎం డౌన్ డౌన్ - సిపిఐ రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణకు నిరసనగా సత్యసాయి జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి పూల శ్రీనివాసులు, సిపిఐ మండల కార్యదర్శి చలపతి నాయుడుఆధ్వర్యంలో శుక్రవారం కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ గో బ్యాక్, పిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణతో కార్మికులు, ఉద్యోగులు రోడ్డున పడతారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసం హరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రామాంజినేయులు, నారాయణప్ప, రామునాయుడు, రమణ, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

## నేడు సున్నంపల్లిలో గడపగడపకు మనప్రభుత్వం

ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త : మండలంలోని సున్నంపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని మహమ్మదాబాద్ క్రాసింగ్‌లో గ్రామలలో నేడు(శనివారం) నిర్వహించే గడపగపడకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధితో పాటు ఎంపిడిఓ పోలప్పలు శుక్రవారం వేర్వేరు ప్రకటనలలో తెలియచేశారు. ఎమ్మెల్యే ప్రతి గడపను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ అందచేసే ప్రభుత్వ పరమైన సేవలపై ప్రజలతో మమేకమవుతున్నట్లు వారు తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## నిధులు పుష్కలంగా ఉన్నా ప్రజలకు తప్పని త్రాగునీటి తిప్పలు

### - 14 వ ఆర్థిక సంఘం నిధులు అందలేక చేతులెత్తేసిన సర్పంచ్‌లు



వెంకటాపురంలో వ్యవసాయ బోర్ల వద్ద త్రాగునీటి కోసం వేచి ఉన్నగ్రామస్తులు

ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త : పంచాయితీలలో 14వ ఆర్థిక సంఘం నిధులు పుష్కలంగా ఉన్నా పంచాయితీ వాసులకు త్రాగునీటి తిప్పలు తప్పడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా పంచాయితీ సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తున్నా అవి వారి చేతికి రాక సర్పంచ్‌లు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీ తంగా ఉన్నాయి. ప్రధానంగా పంచాయితీ కేంద్రాలతో పాటు మజరా గ్రామాలలో మౌళిక వసతుల్లో ప్రాధాన్యమైన తాగునీటి సరఫరా. అయితే పలు గ్రామాల్లో గత 3 సంవత్సరాలు భారీ వర్షాల కారణంగా త్రాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినడం, మోటార్లు చెడిపోవడం, మరీ ముఖ్యంగా విద్యుత్ బకాయిలను చెల్లించకపోవడం వంటి కారణాలతో సర్పంచ్‌లు ఏమీ చేయలేని నిస్సాహక పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారుల స్పందించి ప్రజలకు దాహార్తి తీర్చాలని కోరుకుంటున్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి -సైకాలజీ కౌన్సిలర్ లహరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైకాలజీ కౌన్సిలర్

ముదిగుబ్బ, నవంబర్ 11 ప్రభాతవార్త

విద్యార్థులు బాగా చదివి అన్ని రంగాల్లో రాణించాలని సైకాలజీ కౌన్సిలర్ లహరి పేర్కొన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ముదిగుబ్బ పట్టణంలోని పివిఎస్ పాఠశాలలో విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య గురించి, విద్య యొక్క గొప్పతనం గురించి మరియు సమాజంలో బాలికల పట్ల జరుగుతున్న అరాచకాల గురించి వివరిస్తూ సమాజంలో మహిళలు ఎలా వుండాలో విద్యార్థినిలకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు భవిష్యత్తులో ఎటు వంటి ఆలోచనలతో సమాజంవైపు నడవాలని, అదేవిధంగా విద్యార్థి దశలో ఎంచుకున్న మార్గాల వైపు పయనించి ఉన్నత శిఖరాలు అధిరోహించి తమ కుటుంబంతో పాటు సమాజంలో కూడా తమవంతు నిర్వహించాల్సిన బాధ్య తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యా ర్థినిలు పాల్గొన్నారు.

## ఊరుచింతలలో జనచైతన్యయాత్ర

తాడిపత్రిరూరల్, నవంబర్ 11 ప్రభాతవార్త

మండలంలోని ఊరుచింతల గ్రామంలో శుక్రవారం జరిగిన జనచైతన్య యాత్రలో యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికి వెళుతూ ప్రజలకు ప్రభుత్వం నుండి అందుతున్న పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన వారందరికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగాకురుబల ఆరాధ్య దైవం శ్రీభక్త కనకదాసు జయంతి



నివాళులు అర్పిస్తున్న సవిత



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే,ఎంపిలు



నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి

పెనుకొండ, నవంబర్ 11 ప్రభాతవార్త

.పెనుకొండ నియోజక వర్గం కేంద్రంలో శ్రీ భక్త కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవిత ఆధ్వర ్యంలో ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోసీని యర్ టిడిపి నాయకులు మాధవనాయుడు, రామ కృష్ణ ప్ప, సోమందేపల్లి మాజీ జడ్పిటిసి వెంకటరమణ, మాజీ జడ్పిటిసి రాంపురం సర్పంచు శ్రీనివాసులు, గుట్టూరు మాజీ సర్పంచు సూర్యనారాయణ, కురుబ వాండ్లపల్లి మాజీ సర్పంచు పెద్దన్న, మాజీ ఎంపిటిసి రమణమ్మ, డ్వాక్రా రామాం జినేయులు నాగార్జున, రవి కు మార్, కిష్టప్ప, త్రివేంద్ర నాయుడు, హుజూరుల్లా ఖాన్, బాబు ల్‌రెడ్డి, మణికంఠ, నంజుండ, వాసుదే వరెడ్డి, ఓబులేసు, మేకల పల్లి ఆది, టిడిపి నాయకులు, కార్యకర్తలు, కురు బ కులస్తులు పాల్గొన్నారు. వీరితోపాటు ఎమ్మెల్యే శంకర్ నారాయణ, హిందూ పురంపార్ల మెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్ కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా కనకదాసు విగ్రహానికి తేదేపారాష్ట్ర జోనల్ ఇన్‌చార్జ్ అమర్‌నాథ్‌రెడ్డి, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బికె.పార్థ సారధిలు సైతం ఘనంగా నివాళులు అర్పించారు.

## కనకదాసు గొప్ప ఆధునిక కవి

### -జిల్లా పరిషత్ వైస్‌చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ



కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

నార్పల రూరల్, నవంబర్ 11 ప్రభాతవార్త

కనకదాసు గొప్ప ఆధునిక కవి అని నార్ప లకు చెందిన జిల్లా పరిషత్ వైస్‌చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ పేర్కొన్నారు. అనంత పురంలోని గుత్తిరోడ్డులో కనకదాసు విగ్రహం వద్ద శుక్రవారం జరిగిన ఆయన జయంతి వేడుకల్లో జిల్లా పరిషత్ వైస్‌చైర్‌పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనకదా సు విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించా రు. అనంతరం ఆమె మాట్లాడుతూ కనకదాసు కర్నాట కలో గొప్ప ఆధునిక కవి, తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త అన్నారు. కనకదాసు బాగా చదువుకుని సమా జాన్ని అన్ని కోణాల్లో సూక్ష్మ పరిశీలన చేసి చిన్న వయ సులోనే రామధ్యాయ మంత్రాన్ని రచించి సామా న్యులకు అర్థమయ్యే విధంగా కన్నడ భాషలో రచనలు చేస్తూ కీర్తనలు రాస్తూ వేదాంతాన్ని అభ్యసించి గొప్ప కృష్ణ భక్తుడయ్యారని పేర్కొన్నారు. ఇలాంటి గొప్ప కవి జయంతి వేడుకలు జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదాంతం మోహన్, కాగొల్ల ప్రభుదాస్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు

### - ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పెద్దవడుగూరు, నవంబర్ 11 ప్రభాతవార్త

అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే వైకాపా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొ న్నారు. మండలంలోని వీరన్నపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటిస్తూ ప్రభుత్వం నుండి అందుతున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. అంతేకాకుండా గడపగడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని వారికి ఎమ్మెల్యే హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామి, ఎద్దుల శరభరెడ్డి, లక్కు రామచంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, జెడ్‌పిటిసి చితంబరరెడ్డి, కాసేపల్లి రామకృష్ణారెడ్డి, దేవమోహన్‌రెడ్డి, మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సచివాలయం ఉద్యోగుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న సచివాలయం సిబ్బంది

యల్లనూరు, నవంబర్ 11 ప్రభాతవార్త

మండలంలోని పెద్దమల్లేపల్లి సచివాలయంలో శుక్రవారం సచివాలయం సిబ్బంది ప్రొబేషన్ డిక్లరేషన్ చేసినందుకు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహశీల్దార్ రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, ఇఒఆర్‌డి విజయ శేఖర్‌నాయుడు హాజరయ్యారు. వారిచే సచివాలయం సిబ్బంది కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు విజయలక్ష్మి, రామాంజులరెడ్డి, హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, వైకాపా నాయకులు మునిస్వామినాయుడు, నాగేశ్వర్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సచివాలయం సిబ్బంది ఇచ్చిన విందులో వారు పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ ఎడ్యుకేషన్ డే వేడుకలు



ఆజాద్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, నవంబర్ 11 ప్రభాతవార్త

పట్టణంలోని పెం గ్విన్ మాంటిస్సోరి ఇం టర్‌నేషన్ ప్రీస్కూల్ అండ్ ప్లేస్కూల్ ఆధ్వర్య ంలో శుక్రవారం నేష నల్ ఎడ్యుకేషన్ డేను ఘనంగా జరుపుకున్నా రు. ఇందులో భాగంగా పట్టణంలోని సిబి రోడు లో వున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

### - రేషన్ సమస్యపై ఎమ్మెల్యేకు వివరించిన గ్రామస్తులు



రేషన్ సమస్య గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న గ్రామస్తులు

యాడికి, నవంబర్ 11 ప్రభాతవార్త

మండలంలోని పిన్నేపల్లి గ్రామంలో ప్రతి నెలా రేషన్ సరుకులు ఒకే రోజు పంపిణీ చేస్తారని, ఆ రోజు రేషన్ తీసుకున్న వారికి మాత్రం సమస్య లేదని వివిధ కారణాలతో అదేరోజు రేషన్ తీసుకోని వారి పరిస్థితి గురించి ఆలోచించి తిరిగి కనీసం మరో రోజు రేషన్ పంపిణీ అయ్యేలా చూడాలని పిన్నేపల్లి గ్రామానికి చెందిన ప్రజలు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వద్ద మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులను ఉద్దేశించి ప్రతి లబ్దిదారునికి రేషన్ అందేలా చూడాలని ఆదే శించారు. శుక్రవారం గడపగడప కార్యక్రమంలో పై సమస్యతో పాటు డ్రైనేజి సమస్యను కూడా త్వరలో పరిష్క రిస్తామని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, బాలా రమేష్ బాబు, మాజీ జెడ్‌పిటిసి వెంకటరామిరెడ్డి, శివప్ర సాద్, రామ మోహన్, నాగరాజు, తలారి నాగేష్, రషీద్, సం జీవ, రాయుడు, కెఎల్‌ఎన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి తన హామీని నిలబెట్టుకోవాలి - వడ్డెర్ల సంఘం



మాట్లాడుతున్న వడ్డెర సంఘం అధ్యక్షులు నాగశేఖర్

యాడికి, నవంబర్ 11 ప్రభాతవార్త

పాదయాత్రలో అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకో వాలని వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు తెలి యచేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏపి వడ్డెర సంఘం కార్యాలయంలో ఏపి వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేరంగుల నాగశేఖర్, ఉపాధ్యక్షులు మధు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వడ్డెర కార్పోరేషన్‌కు వెయ్యి కోట్ల నిధులు కేటాయి స్తామని, వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని తదితర హామీలు జగన్ ఇచ్చారని 2019లో అధికారం లోకి వచ్చిన తరువాత తమకు మొండి చేయి చూపార న్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్య క్రమంలో వడ్డెర సంఘం నాయకులు నాగేంద్ర, గుత్తి మాజీ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు, గుంతకల్లు తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సుదర్శన్, అనంతపురం మంజునాథ్, పామిడి శివ, తదితరులు పాల్గొన్నారు.

## వేడుకలా గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

యాడికి, నవంబర్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గ్రంథాలయ అధికారి మధుసూదన్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో 55వ గ్రంథాలయ వారోత్సవాలను వేడుకలా నిర్వహించారు. అంతకుమునుపు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియచేశారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాలకు సూచికంగా గోడపత్రికలను ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, రామ్మోహన్, విశ్వనాథ్, నాగన్న, లోకేశ్వరి, ఓబులమ్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లిని దర్శించుకుని మున్సిపల్‌చైర్మన్ జె.సి

తాడిపత్రిఅర్బన్, నవంబర్ 11 ప్రభాతవార్త

పట్టణంలోని ఏటిసందువీధిలో వెలసిన శ్రీపెద్దమ్మ తల్లిని శుక్రవారం మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభా కర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయం 11వ వార్షికో త్సవాన్ని పురస్కరించుకుని జె.సి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందచేసి ఆశీర్వదించారు. అనంతరం జె.సి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కిడ్స్ కేవ్ ప్లేస్కూల్‌లో ఆకట్టుకున్న ఫుడ్‌ఫెస్టివల్

### - హాజరైన ఎంఇఒ నాగరాజు



బహుమతి అందచేస్తున్న ఎంఇఒ





కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తాడిపత్రిఅర్బన్, నవంబర్ 11 ప్రభాతవార్త

పట్టణంలోని సంజీవనగర్ మొదటి రోడ్డులోని కిడ్స్ కేవ్ ప్లేస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ఎంఇఒ నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీవాణి స్కూల్ ప్రిన్సిపాల్ బాలస్వామి, పద్మవాణి హైస్కూల్ కరస్పాండెంట్ నాగపీరయ్య, ఎబివిపి అఖిల్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయు లు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఇందులో భాగంగా పాఠశాల నిర్వాహకులు సోమల అనితరెడ్డి హాజరైన వారికి స్వాగతం పలికారు. ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసి వివిధ రకాల రుచికరమైన వంటలను తీసుకొచ్చి ప్రదర్శనలో వుంచారు. ఎంఇఒ నాగరాజుతో పాటు వివిధ పాఠశాలల నుండి వచ్చిన సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదర్శనలో ఏర్పాటు చేసిన అని ్నరకాల వంటలను రుచి చూశారు. మంచి రుచితో కొత్త కొత్త వంటకాలతో తయారు చేసి తీసుకొచ్చి ప్రదర్శనలో వుంచిన విద్యార్థులను వారంతా అభినందించారు. అలాగే ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించిన వంటకాల్లో ఉత్తమ వంటకానికి సంబంధించిన విద్యార్థి తల్లిదండ్రులకు ఎంఇఒ నాగరాజు చేతుల మీదుగా బహుమతిని అందచేశారు. ఈ కార్యక్రమంలో జెబిఎన్ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంకు 104వ వ్యవస్థాపక దినోత్సవ సంబరాలు



యల్లనూరు యూనియన్ బ్యాంకులో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



వెన్నపూసపల్లి యూనియన్ బ్యాంకులో కేక్‌కట్ చేస్తున్న జెడ్‌పిటిసి, మేనేజర్

యల్లనూరు, నవంబర్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో శుక్రవారం యూనియన్ బ్యాంకు 104వ వ్యవస్థాపక దినోత్సవ సంబరాలను సబ్‌మేనేజర్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా బ్యాంకులో వివిధ రకాల పూలు, బెలూన్లతో అలంకరించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అదేవిధంగా వెన్నపూసపల్లిలోని యూనియన్ బ్యాంకులో మేనేజర్ మధు ఆధ్వర్యంలో 104వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## మాజీ ఎంపీపీ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి, సీవీ రమణారెడ్డి.

తాడిపత్రి, ప్రభాతవార్తః యాడికి మాజీ ఎంపీపీ బాలాజీ చంద్రశేఖర్ చౌదరి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ప్రముఖ స్వచ్ఛంద సేవకులు సీవీ రమణారెడ్డిలు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మరణించిన విషయం విదితమే. మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులు లక్ష్మీనరసమ్మ, రాధమ్మ,సందీప్, రూపునేని రాజశేఖర్, రాజప్ప, నాగేశ్వరరావు తదితరులకు ఆయన భరోసాని చ్చారు. యాడికి బాబుగా మండల వ్యాప్తంగానే గాక జిల్లా వ్యాప్తంగా అందరికీ సుపరిచితుడైన బాలాజీ చంద్రశేఖర్ చౌదరి పార్టీలకు అతీతంగా తమకు ఆత్మీయుడని, ఆయన కుటుంబ సభ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఆదుకోవడానికి తాము ముందుంటామని ఎమ్మెల్యే పెదారెడ్డి పేర్కొన్నారు. ఆయన మరణం తమకు తీరనిలోటని ఆయన అన్నారు. యాడికి బాబు చిత్రపటం ముందు నివాళులు అర్పించారు. మాజీ ఎంపీ పీ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ప్రము ఖులు సీవీ రమణారెడ్డి, బోగాతి బ్రహ్మానందరెడ్డి, సజ్జలదిన్నె రాజు తదితరులు ఉన్నారు.

## ఇన్ఫోసిస్‌కు టెక్ విద్యార్థి ఎంపిక



అంకిత్

తాడిపత్రిరూరల్, నవంబర్ 11 ప్రభాతవార్త

పట్టణ సమీపంలోని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల లో కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన అంకిత్ అనే విద్యార్థి ఇన్ఫోసిస్‌కు ఎంపికయ్యాడు. విద్యార్థి ఎంపిక కావడం పట్ల ప్రిన్సి పాల్ డాక్టర్ ఇవి సుబ్బారెడ్డి ప్రత్యేక ంగా అభినందించారు. ఎంపికైన విద్యార్థికి హైదరా బాద్‌లో ఉద్యోగం రావడం జరిగిందని వైస్‌ప్రిన్సిపాల్ ఎంసి భానుప్రసాద్ తెలిపారు. దీంతో టెక్ కళాశాలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల సంఖ్య 226కు చేరి నట్లు డిఒఎ నటరాజేశ్వంరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యా ర్థిని కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి అభినందించారు.

## కనకదాసు జయంతి వేడుకలు



కనకదాసు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పుట్లూరు, నవంబర్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలో భారతీయ జనతాపార్టీ పుట్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో మహాకవి కనకదాసు 535వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ కురబల ఆణిముత్యం గొప్ప భక్తుడు, ఆధునిక కవి, సర్వకర్త సంగీతకారుడు, ఆయనకు చదువు మీద మక్కువ ఎక్కువగా వుండేదన్నారు. నరసింహస్తోత్రం, రామాధ్యాయ మంత్రం, మోహన తరంగిణి అనే రచనలు సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రచనలు చేశారన్నారు. కనకదాసు ప్రధాన రచనలు మల్లచరిత్ర, హరిభక్తసార, రామధ్యాన చరిత్ర, మోహన తరంగిణి అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కుందు శ్రీనివాసులరెడ్డి, ఒబిసి మోర్చా మండల అధ్యక్షులు రాగేని రామాంజియాదవ్, జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, భజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజన అనంత శివారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

పుట్లూరు, నవంబర్ 11 ప్రభాతవార్త

విశాఖపట్టణానికి ప్రధాని నరేంద్రమోడి వస్తున్న సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ ప్రధాని మోడి విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ పేరుతో ఆదానికి దారాదత్తం చేయడా నికి వస్తున్న మోడికి రాష్ట్ర ప్రభుత్వం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి 3 లక్షల మందితో స్వాగతం పలక డానికి ఏర్పాట్లు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోడికి మోకరిల్లడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు పెద్దిరాజు, చేతివృత్తిదారుల సమైక్య మండల అధ్యక్షులు ఓబుళపతి, రైతు సంఘం నాయకులు పెద్దకొండయ్య, శివ, బాలకొండయ్య, ఓబులేసు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, నవంబర్ 11 ప్రభాతవార్త

పట్టణంలోని ఏటిసందువీధిలో వెలసిన శ్రీపెద్దమ్మతల్లి ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆలయానికి చేరుకోగానే నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందచేసి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు వున్నారు.

Government of India
Azadi Ka Amrit Mahotsav



# ఆంధ్ర ప్రదేశ్‌కు రూ. 10,700 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల బహుమతి

## శ్రీ నరేంద్ర మోది

ప్రధాన మంత్రి

ద్వారా

## శంకుస్థాపన మరియు 7 అభివృద్ధి ప్రాజెక్టులు జాతికి అంకితం

### శంకుస్థాపన చేయబడుతున్న ప్రాజెక్టులు

శ్రీకాకుళం - అంగుల్ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ (745 కిమీ) (రూ. 2658 కోట్లు)

ఎన్‌హెచ్-130సిడి యొక్క రాయ్‌పూర్ - విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్‌లో 6-లేన్ల గ్రీన్ ఫీల్డ్ (రూ. 3778 కోట్లు)

విశాఖపట్నంలోని ఎన్‌హెచ్-516సి పైన కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలా నగర్ జంక్షన్ వరకు 6 లేన్ల రోడ్డు మెరుగుపరచడం మరియు విశాఖపట్నం పోర్ట్ కనెక్టివిటీ కోసం అదనంగా 4 లేన్ల డెడికేటెడ్ పోర్ట్ రోడ్డు (రూ. 566 కోట్లు)

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ మరియు అభివృద్ధి చేయడం (రూ. 152 కోట్లు)

విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి (రూ. 460 కోట్లు)

### జాతికి అంకితమిచ్చే ప్రాజెక్టులు

కృష్ణా గోదావరి డీప్ వాటర్ బ్లాక్‌లో ఒఎన్‌జిసి-యు-ఫీల్డ్ ఆన్‌షోర్ సదుపాయాలు (రూ. 2917 కోట్లు)

ఎన్‌హెచ్-326ఎ యొక్క నరసన్నపేట నుండి పాతపట్నం వరకు పునరావాసం మరియు అభివృద్ధి, శ్రీకాకుళం-గజపతి కారిడార్‌లో పవేడ్ షోల్డర్‌తో 2 లేన్లకు విస్తరించడం (రూ. 211 కోట్లు)

### ఈ ప్రాజెక్టుల యొక్క ప్రయోజనం

- పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ మరియు ఒడిషాలు పరిశుభ్రమైన గ్యాస్‌ను సరఫరా చేయడంలో స్వయం సమృద్ధి సాధిస్తాయి మరియు తమ హరిత శక్తి అవసరాలను నెరవేరుస్తాయి
- జాతీయరహదారుల అభివృద్ధి తత్సంబంధిత ప్రాంతంలో సామాజిక, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు ట్రాఫిక్‌ను కూడా సాఫీ చేస్తుంది
- ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి మరియు ఆధునీకరణలు, మత్స్యకారులకు మరియు చేపల వ్యాపారాలకు ఆర్థిక సుసంపన్నతను తెస్తాయి
- డీప్ వాటర్ బ్లాక్‌లో కనుగొన్న గ్యాసు విలువ శక్తి భద్రతను పెంచుతుంది
- శక్తివంతమైన రహదారి నెట్ వర్క్ ద్వారా స్థానిక ఉత్పత్తులు మరింత వ్యాపారాన్ని సృష్టించడం మరియు స్థానిక యువత కోసం కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పాటు
- విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి చేయడం ద్వారా ప్రయాణికులకు ప్రపంచ స్థాయికి చెందిన సదుపాయాలు

### ఈ ప్రముఖుల సమక్షంలో

**శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్**
గవర్నర్, ఆంధ్ర ప్రదేశ్

**శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి**
ముఖ్యమంత్రి, ఆంధ్ర ప్రదేశ్

**శ్రీ అశ్విని వైష్ణవ్**
కేంద్ర రైల్వేలు, కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి

**శ్రీ ఎం.వి.వి. సత్యనారాయణ**
పార్లమెంట్ సభ్యులు (లోక్ సభ), విశాఖపట్నం

**శ్రీ జి.వి.ఎల్. నరసింహారావు**
పార్లమెంట్ సభ్యులు (రాజ్య సభ)

**శ్రీ సి.ఎం. రమేష్**
పార్లమెంట్ సభ్యులు (రాజ్య సభ)

**శ్రీ వాకాటి నారాయణ రెడ్డి**
శాసన మండలి సభ్యులు

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్**
శాసన మండలి సభ్యులు

(డిడి న్యూస్‌లో లైవ్ ప్రసారం చూడండి)

**శనివారం, 12 నవంబరు, 2022 న ఉదయం 10:15 గం.లకు.**
**యూనివర్సిటీ గ్రౌండ్, విశాఖపట్నం, ఆంధ్ర ప్రదేశ్**




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.

12-11Pg5exHMNWJQEFFFFF.qxp:Layout 1 12/11/22 12:43 AM Page 1







"ఉత్తమమైన రవాణా, అనుసంధానం, ఉత్పాదకత, స్థిరత్వం మరియు భద్రత కొరకు భవిష్యత్ తరం మౌలిక సదుపాయాల కల్పన కొరకు మా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తున్నది."

**నరేంద్ర మోది**, ప్రధానమంత్రి

## రూ. 2,300 కోట్ల పెట్టుబడితో 3 జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంఖుస్థాపన

### 'మెదక్-సిద్దిపేట-ఎల్కతుర్తి' సెక్షన్ లో పేవ్డ్ షోల్డర్స్‌తో రెండు వరుసల రహదారి విస్తరణ
(NH-765DG I పొడవు : 134 కి.మీ I వ్యయం: ₹ 1461 కోట్లు)

### 'బోధన్-బాసర-భైంసా' సెక్షన్ లో పేవ్డ్ షోల్డర్స్‌తో రెండు వరుసల రహదారి విస్తరణ
(NH-161BB I పొడవు : 56 కి.మీ. I వ్యయం: ₹ 644 కోట్లు)

### 'సిరొంచ - మహదేవ్‌పూర్' సెక్షన్ లో పేవ్డ్ షోల్డర్స్‌తో రెండు వరుసల రహదారి విస్తరణ
(NH-353C I పొడవు : 17 కి.మీ. I వ్యయం: ₹ 163 కోట్లు)

- 2014 నుండి తెలంగాణలో జాతీయ రహదారుల పొడవు రెండింతలు పెరిగింది.
- ప్రధాన మంత్రి ప్రస్తుత చొరవ, దీర్ఘ దృష్టితో తెలంగాణకు అత్యాధునిక మౌలిక సదుపాయాలతో మరింత మెరుగు పరుచుట.
- తెలంగాణ అభివృద్ధికి రూ. 6500 కోట్ల వ్యయంతో ఎకనామిక్ కారిడార్ల నిర్మాణం.
- హైదరాబాద్ చుట్టు 350 కి.మీ. పొడవైన రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) నిర్మాణంతో అనుసంధానం.
- హైదరాబాద్ నగరంలో రూ.3821 కోట్లతో ఫ్లైఓవర్లు & ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం.
- 207 కి.మీ. పొడవైన ఆధునిక జాతీయ రహదారుల నిర్మాణంతో తెలంగాణ అభివృద్ధి కోసం భారత ప్రభుత్వ ప్రయత్నాలు మరింత వేగవంతం.
- తెలంగాణలోని వ్యవసాయ, వస్త్ర మరియు పాల ఉత్పత్తి ప్రాంతాలకు మెరుగైన జాతీయ రహదారులతో అనుసంధానికి 3 ప్రాజెక్టులతో నిర్ధారణ.
- హైదరాబాద్ వరంగల్ ఇండస్ట్రియల్ కారిడర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అనుసంధానించే ప్రాజెక్టుల ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు.
- తెలంగాణ మరియు మహారాష్ట్ర మధ్య అంతర్రాష్ట్ర కనెక్టివిటీని బలోపేతం చేయడం.
- బొగ్గు గనులు మరియు థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంతాలకు సులువైన మార్గం లభ్యం.
- బలమైన జాతీయ రహదారుల అనుసంధానం ద్వారా మేడారంలోని ప్రసిద్ధ గిరిజన పుణ్యక్షేత్రం (సమ్మక్క-సారక్క) మరియు బాసరలోని సరస్వతి ఆలయానికి త్వరగా చేరుకోవడానికి మెరుగైన సౌకర్యం.

## శ్రీ నరేంద్ర మోదీ
**ప్రధాన మంత్రి**
వారి అమృత హస్తాల మీదుగా

అధ్యక్షత వహించువారు

**డా. తమిళసై సౌందరరాజన్**
గవర్నర్, తెలంగాణ

**శ్రీ కె.చంద్రశేఖర్ రావు**
ముఖ్యమంత్రి, తెలంగాణ

**జి. కిషన్ రెడ్డి**
కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మరియు ఈశాన్య ప్రాంతం అభివృద్ధి శాఖ మంత్రివర్యులు

**శ్రీ వేంకటేశ్ నేత బోర్లకుంట**
పార్లమెంటు సభ్యుడు

**శ్రీ బండి సంజయ్ కుమార్**
పార్లమెంటు సభ్యుడు (లోక్‌సభ)

**శ్రీ కోరుకంటి చందర్**
శాసన సభ సభ్యుడు

**12 నవంబర్, 2022 (శనివారం) మధ్యాహ్నం 2.30 గం॥లకు**
**NTPC, రామగుండం నందు, తెలంగాణ**

**DD న్యూస్‌లో ప్రత్యక్ష ప్రసారంలో చేరండి**

